వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 128 | ఎడిటర్ : తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి | అక్టోబర్ 2024 | వెల : రూ 10/-




## సరిహద్దుల్లో శాంతి భద్రత

- సరిహద్దు గస్తీ ఇరు దేశాల మధ్య ముందడుగు
- బ్రిక్స్ సదస్సులో భారత్, చైనా చర్చలు
- జిన్‌పింగ్‌తో ప్రధాని మోడీ చర్చలు

మాస్కో,
రష్యాలోని కజన్‌లో జరుగుతోన్న బ్రిక్స్ దేశాల 16వ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య

-మిగతా 3 లో



## నాంపల్లి కోర్టుకు హాజరైన కేటీఆర్

- తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగిందని వెల్లడి
- కొండా సురేఖ ఆరోపణలపై వాంగ్మూలం

హైదరాబాద్,
పరువునష్టం దావా కేసులో మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లి కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. దాదాపు 20 నిమిషాల పాటు ఆయన స్టేట్‌మెంట్‌ను న్యాయస్థానం రికార్డు చేసింది. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలతో తన పరువు ప్రతిష్టలు

-మిగతా 3 లో




## దూసుకొస్తున్న దానా తుఫాన్

పలు రైళ్లు దారి మళ్లింపు

భువనేశ్వర్,
'దానా' తుపాను ప్రభావం నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే తాజాగా మరికొన్ని రైళ్లను రద్దు చేసింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని కొన్ని రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు పేర్కొంది. 23, 24, 25, 26, 27, 29 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తుపాను నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య కేంద్రాల్లో రైళ్ల రాకపోకల సమాచారం కోసం 17 నగరాలు/పట్టణాల్లో హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు

-మిగతా 3 లో





## వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులే

- వారికి సేవ చేసేందుకే ఇక్కడికి వచ్చా
- రాజకీయాల కోసం ఇక్కడి రాలేదు
- వయనాడ్ ర్యాలీలో ప్రియాంక వెల్లడి
- కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో నామినేషన దాఖలు
- తనలాగే చెల్లిని ఆదరించాలని రాహుల్ పిలుపు
- కార్యక్రమంలో పాల్గొన్న సోనియా, ఖర్గే, రేవంత్, భట్టి

తిరువనంతపురం,
వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులతో సమానమని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. వయనాడ్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ప్రియాంక గాంధీ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు.

-మిగతా 3 లో



## తిరుమలలో టిక్కెట్ల దందా వ్యవహారం

- కలకలం రేపుతున్న దళారీల దందా

తిరుమల
తిరుమల వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ల దుర్వినియోగం తీవ్ర వివాదా స్పదమైంది. బ్లాక్‌లో వీఐపీ దర్శన టికెట్లు అమ్ముకుంటున్నారని ఇప్పటికే తీవ్ర విమర్శలు వ్యక్తమవు తున్నాయి.. ఇప్పటికే.. పలువురు ప్రజాప్రతినిధుల

-మిగతా 3 లో



## దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

- ఉచిత ఇసుక సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దు
- ఇసుక అక్రమంగా విక్రయిస్తే పిడి యాక్ట్
- కొరత ఉన్న ఐదు జిల్లాలో ఇసుక పాయింట్ల ఏర్పాటు
- విశాఖ శారదాపీఠం భూముల కేటాయింపు రద్దు
- ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు
- ఎపి కేబినేట్ భేటీలో కీలక నిర్ణయాలు

అమరావతి,
దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు ఎపి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నగదు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేస్తే.. 48 గంటల్లో తిరిగి అకౌంట్‌లో నగదు జమయ్యేలా చూడాలని నిర్ణయించారు. ఒకేసారి మూడు సిలిండర్లు తీసుకోకుండా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఇవ్వాలని

-మిగతా 3 లో



## హైడ్రాపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

- నిబంధనల మేరకు చర్యలుండాలని ఆదేశం

హైదరాబాద్
మూసీ రివర్ బెడ్స్‌లో నిర్మాణాల కూల్చివేత, రిజర్వాయర్ల రక్షణకు ఏర్పాటైన హైడ్రా చర్యలను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. బాధితులకు నోటీసులు ఇచ్చాకే తదుపరి చర్యలు ఉండాలని ఆదేశించింది. సర్వే చేశాక అక్రమణలను గుర్తించాలనీ, ఆ తర్వాత ఆక్రమణదారులకు గడువుతో కూడిన నోటీసులు ఇచ్చాకే కూల్చివేత చర్యలుండాలంటూ ప్రజాశాంతి

-మిగతా 3 లో



## మూసీ సుందరీకరణ కాదు.. మురికిని నివారించండి

పేదల ఇళ్లను కూల్చడం సరికాదు ఈటెల

హైదరాబాద్
మూసీ సుందరకీకరణ పేరుతో పేదలను తరిమి వేయవద్దని మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పేదల ఇంటిని లాక్కోవడం సరికాదన్నారు. ముందు మూసీలో మురికి చేరకుండా చూడాలన్నారు. బుధవారం సాయంత్రం చైతన్యపురి డివిజన్ పరిధిలోని మూసీ నిర్వాసితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈటల చేసిన పోరాటం వల్లే మా ఇళ్లు ఇప్పటికీ

-మిగతా 3 లో

## నీ తాటాకు చప్పళ్లకు భయపడే వాళ్లం కాదు

- నోటీసులకు నోటీసులతోనే సమాధానం ఇస్తున్నా
- నువ్వెంత సుద్దపూసో ..ప్రజలకు తెలుసు
- కేటీఆర్ నోటీసులపై బండి సంజయ్ ఘాటు సమాధానం



హైదరాబాద్,
లీగల్ నోటీసులతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పంపిన లీగల్ నోటీసులపై ఆయన స్పందించారు. నన్ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీసులు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోంది. తాటాకు చప్పుళ్లకు

-మిగతా 3 లో

# అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఆందోళన

-ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తూ ప్రజల నిరసన
-ప్రజల ఆందోళనతో రామన్నపేటలో ఉద్రిక్తత
-బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్



రామన్నపేట,
యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేటలో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా స్థానికులు ఆందోళనకు దిగారు. సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు అడ్డుకున్నారు. పోలీసుల నిర్బంధాలను దాడుకు ప్లకార్డులు, నల్లజెండాలతో నిరసనకు దిగారు. పర్యావరణవేత్తల పేరుతో అంబుజాకు అనుకూలంగా మాట్లాడేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారిని తరిమికొట్టారు. పరిశ్రమ పేరుతో తమ బతుకులను బుగ్గి చేస్తే సహించేది లేదని హెచ్చరిక చేశారు. కంపెనీ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఒపుకునేది లేదని తేల్చిచెబుతున్నారు. కాగా, కంపెనీని ఏర్పాటును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఎట్టిపరిస్థితలో పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిథులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేస్తున్నారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను నకిరేకల్‌లో అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఇక మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, రవీంద్రకుమార్ నాయక్‌లను గృహ నిర్బంధంలో ఉంచారు. రామన్నపేటలో గతంలో లాజిస్టిక్ పార్కు, డ్రైపోర్టు కోసం రైతుల నుంచి కొనుగోలు చేసిన భూముల్లో కాలుష్య కారక సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు అదాని చర్యలు ప్రారంభించారు. 65.5 ఎకరాల్లో కంపెనీ స్థాపనకు రూ.1,400 కోట్లు ఖర్చు చేయనున్నారు. స్టాండ్ అలోన్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌లో ఏటా 6.0 ఎంఎంటీపీఏ సిమెంట్ ఉత్పత్తికి ప్రతిపాదనలు చేశారు. ఈ నెల 23న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తున్న ప్రజలు ప్రభుత్వం, అదానీని తప్పు బడుతూ పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. పరిశ్రమ స్థాపన నిర్ణయాన్ని ఉపసహించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఉగ్రవాదంపై పోరుకు ప్రపంచం ఏకతాటిపై నిలవాలి

-ద్వంద్వ ప్రమాణాలు మంచివి కావు
-పరోక్షంగా చైనాను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యలు



మాస్కో
ఉగ్రవాదంపై పోరుకు యావత్ ప్రపంచం ఏకతాటిపై నిలవాలని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దీనిపై ద్వంద్వ ప్రమాణాలకు తావీయరాదని పరోక్షంగా చైనా తీరును ఎండగట్టారు. కజాన్‌లో జరుగుతున్న 16వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో మోదీ మాట్లాడుతూ, ఉగ్రవాదం అనే తీవ్ర సమస్యను కలిసికట్టుగానే ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఇలాంటి అంశాల్లో ద్వంద్వ ప్రమాణాలు సరికాదన్నారు. ఉగ్రవాదం, ఉగ్రవాదులకు నిధుల సరఫరా అనేవి చాలా తీవ్రమైన సమస్యలు. వీటిని చాలా సమర్ధవంతంగా ఎదుర్కోవాలి. ఇందుకు అంతా కలిసికట్టుగా పనిచేయాలి' అని మోదీ సూచించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర నేరుగా ఏ దేశం పేరును ప్రస్తావించకపోయినప్పటికీ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్థాన్‌కు చైనా ఆర్థిక సహాయాన్ని ఎండగట్టారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే రాడికలైజేషన్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. యువతను అతివాదులుగా మారేందుకు ప్రేరేపించడాన్ని సమష్టిగా ప్రపంచదేశాలు అడ్డుకోవాలని అన్నారు. అంతర్జాతీయ తీవ్రవాదంపై యూఎన్ కాంప్రహెన్సివ్ కన్వెన్షన్‌లో ప్రస్తావించిన పెండింగ్ అంశాలపై కూడా అంతా కలిసికట్టుగా పనిచేయాలని సభ్యదేశాలకు మోదీ పిలుపునిచ్చారు. సైబర్ సెక్యూరిటీ అనేది కీలకమని, సైబర్ సెక్యూరిటీ, సేఫ్, సెక్యూర్ ఏఐపై అంతర్జాతీయ రెగ్యులేషన్సపై సభ్యదేశాలు కలిసకట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మోదీ అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, డబ్ల్యూటీఓ వంటి గ్లోబల్ సంస్థల్లో కూడా ఎప్పటికప్పుడు సంస్కరణలు తెచ్చేందుకు ముందుకు రావాలని సూచించారు. చర్చలు, దౌత్యానికి భారత్ బాసటగా నిలుస్తుందని, యుద్ధానికి కాదని ప్రధాని మరోసారి స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ఆహారం, నీరు, ఇంధనం, ఆరోగ్యం వంటి అంశాలు అన్ని దేశాలకు ప్రాధాన్యతాంశాలని అన్నారు. 'బ్రిక్స్' అంటే విభజన గ్రూప్ కాదని, పబ్లిక్ ఇంట్రెస్ట్ గ్రూప్ అనే స్పష్టమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు మనం ఇవ్వాలని అన్నారు. బ్రిక్స్ భాగస్వామ్య దేశంగా కొత్త కొత్తదేశాలకు స్వాగతం పలికేందుకు ఇండియా సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేశారు. అయితే ఇందుకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్రిక్స్ వ్యవస్థాపక దేశాల అభిప్రాయాలను గౌరవించాల్సి ఉంటుందన్నారు. జోహెన్నెస్‌బర్గ్ సమ్మిట్‌లో అంగీకరించిన సిద్ధాంతాలు, ప్రమాణాలు, క్రైటీరియా, ప్రొసీజర్‌ను తూచ తప్పకుండా సభ్యదేశాలు పాటిస్తూ ముందుకు వెళ్లాలని దిశానిర్దేశర చేశారు.

# గంగారెడ్డి హత్యపై ప్రభుత్వం సీరియస్

-చేసిని వారిని..చేయించిన వారినీ వదలబోం
-మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ



హైదరాబాద్
జగిత్యాలలో కాంగ్రెస్ నేత గంగారెడ్డి హత్యపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, దోషులను వదిలేది లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మర్డర్ ఎవరు చేసినా.. ఎవరు చేయించినా వదిలేది లేదని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీతో ఇప్పటికే మాట్లాడటం జరిగిందని తెలిపారు. జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడి హత్య, ఆ తరువాత జరిగిన పరిణామాలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. జీవన్ రెడ్డితో ఇప్పటికే పీసీసీ చీఫ్ మాట్లాడారని తెలిపారు. జీవన్ రెడ్డితో నేను కూడా మాట్లాడుతా అని మంత్రి చెప్పారు. జీవన్ రెడ్డి పార్టీలో అత్యంత సీనియర్ నేత అని... ఆయన సేవలను తాము వినియోగించుకుంటామన్నారు. పార్టీలో జీవన్ రెడ్డి గౌరవానికి భంగం కలిగించమని వెల్లడించారు. చనిపోయిన బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జీవన్ రెడ్డి కంటే ముందే మా కుటుంబం కాంగ్రెస్‌లో ఉంది. గంగారెడ్డి హత్యకు నాకు సంబంధం లేదని ఎమ్మెల్యే సంజయ్ స్పష్టం చేశారు. వేరే కారణాలతోనే గంగారెడ్డి హత్య జరిగిందన్నారు. గంగారెడ్డి హత్యతో కొందరు రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. తాను జగిత్యాల అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. గంగారెడ్డి హత్యపై పూర్తి స్థాయి దర్యాప్తు జరగాల్సిందే అని ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు. మరోవైపు ముఖ్య అనుచరుడు గంగారెడ్డి హత్యతో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. గంగారెడ్డి హత్యకు నిరసనగా జగిత్యాలలో నిరసనలు కూడా చేపట్టారు. ఒకనొక సమయంలో పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు జీవన్ రెడ్డి. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడే సమయంలోనూ ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేశారు. నా 40 ఏళ్ల రాజకీయ జీవితానికి కాంగ్రెస్ మంచి బహుమతి ఇచ్చింది. పార్టీలో కొనసాగడం సాధ్యం కాదు. ఇంతకాలం మానసికంగా అవమానాలకు గురైనా భరించా. ఇప్పుడు భౌతిక దాడులకు పాల్పడుతురు. దయచేసి నన్ను క్షమించండి అన్నా అంటూ జీవన్ రెడ్డి ఫోన్ కట్ చేశారు. అంతేకాకుండా... మీ పార్టీకి.. మీకు ఓ దండం.. మీ పార్టీలో నేను ఇక ఉండను.. ఇక నైనా బతక నివ్వండి అంటూ విప్ లక్ష్మణ్ కుమార్‌తో వ్యాఖ్యలు చేశారు. అయితే గంగారెడ్డి హత్యతో జగిత్యాల జిల్లాలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. హత్యకు నిరసనగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నిరసనకు దిగారు. జగిత్యాలలోని పాత బస్టాండ్ ఆవరణలో నడి రోడ్డుపై కూర్చొని ఆందోళనకు దిగారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కూడా జీవన్‌రెడ్డితో కలిసి ఆందోళనకు దిగారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ కార్యకర్తల నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటల పాటు ఎమ్మెల్సీ ధర్నా చేశారు. మరోవైపు గంగారెడ్డిని హత్య చేసిన నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అలాగే నిందితుడి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. కాల్ డేటా, వాట్సాప్ డేటాను పరిశీలిస్తున్నారు. అలాగే పోలీసులతో నిందితుడికి సంబంధాలపై విచారణ కొనసాగుతోంది.

# రాహుల్ గాంధీ ద్వంద్వ విధానాలు

-హరీశ్‌రావు మండిపాటు



హైదరాబాద్,
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ద్వంద్వ విధానాలు, మోసపూరిత వైఖరి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలతో మరోసారి రుజువైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశమంతా తిరిగి రాజ్యాంగ రక్షణ కోసం ప్రవచిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడం కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీ గారి ద్వంద ప్రమాణాలకు నిదర్శనం అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకే ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నామని స్వయంగా రాష్ట్ర పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

# అక్టోబర్ 31న బ్యాంకులకు దీపావళి సెలవు




న్యూఢిల్లీ,
దీపావళి సహా వివిధ రాష్ట్రాల్లో ఇతర పండగలు జరగనున్న నేపథ్యంలో.. బ్యాంకులకు వరుస సెలవులు రాబోతున్నాయి. కొన్ని చోట్ల వరుసగా 4 రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవా, కర్నాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడుతో సహా అనేక రాష్ట్రాల్లో అక్టోబర్ 31న(గురువారం) దీపావళి జరుపుకుంటున్నారు. దీంతో ఆ రోజు ఈ రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు. ఢిల్లీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అనేక రాష్ట్రాలు నవంబర్ 1న దీపావళి జరుపుకుంటున్నాయి. ఆయా రాష్ట్రాల్లో శుక్రవారం సెలవు ప్రకటించారు. బ్యాంకులకు వెళ్లాలనుకుంటున్న వారు ఈ విషయాన్ని గమనించగలరు. ఇక విద్యా సంస్థలకు జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం 5 రోజులు సెలవులు ప్రకటించగా.. తమిళనాడు సర్కార్ అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీలను సెలవులుగా నిర్ణయించింది.

# నాంపల్లి కోర్టులో నాగార్జున పరువు నష్టం కేసు

-అడ్వకేట్ ద్వారా రిప్లై దాఖలు చేసిన కొండా సురేఖ



హైదరాబాద్,
మంత్రి కొండా సురేఖపై ప్రముఖ సినీనటుడు నాగార్జున వేసిన పరువునష్టం దావాపై నాంపల్లి స్పెషల్ కోర్టులో విచారణ జరిగింది. మంత్రి కొండా సురేఖ తరఫున అడ్వకేట్ గుర్మీత్ సింగ్ రిప్లై ఫైల్ చేశారు. తదుపరి విచారణను న్యాయస్థానం అక్టోబర్ 30కి వాయిదా వేసింది. సినీ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబాన్ని, వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ ఇటీవల మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో నాగార్జున ఆమెపై పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠ దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాంపల్లి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నాగార్జున కేసుతో మంత్రి కొండా సురేఖకు నాంపల్లి స్పెషల్ కోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. హీరో నాగార్జున వేసిన క్రిమినల్, పరువునష్టం దావా కేసులో వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అక్కినేని నాగ చైతన్య, సమంత విడిపోవడానికి కేటీఆర్ కారణమంటూ కొండా సురేఖ చేసిన కామెంట్స్‌పై నాగార్జున కోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. ఓపెన్ కోర్టులో నాగార్జున సహా సాక్షులుగా ఉన్న యార్లగడ్డ సుప్రియ, మెట్ల వెంకటేశ్వర్లు వాంగ్మూలాన్ని న్యాయమూర్తి ఇప్పటికే రికార్డు చేశారు. నాగార్జున అందించిన ఆధారాలను పరిగణలోకి తీసుకున్నారు. నాగార్జునపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వివరణ ఇవ్వాలని కొండాకు జారీ చేసిన నోటీసుల్లో కోర్టు పేర్కొంది.

# రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

-గంటల తేడాలో భార్య డెలివరీ
-విషాద ఘటనతో కటుఉంబ సభ్యులు రోదనలు




కర్నూలు,
ఆ దంపతులకు వివాహమై 14 నెలలు అవుతోంది. భార్య నెలలు నిండిన గర్భిణి. భర్త బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. భార్య తెల్లవారుజామున 4 గంటలకు పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. కొడుకును చూడకుండా తండ్రి అనంతలోకాలకు చేరిన భర్త అంత్యక్రియల్లో పాల్గొనలేని దుస్థితి ఆమెది. రాజోళి మండలం తుమ్మలపల్లికి చెందిన కురువ కొత్తకోట శివ(28) మంగళవారం సాయత్రం ద్విచక్ర వాహనంపై వెళ్లే క్రమంలో అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. దీంతో ఏపీలోని కర్నూల్ ప్రభుత్వ దవాఖానలో స్థానికులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యరాత్రి ఒంటిగంట ప్రాంతంలో మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి గర్భిణీ కావడంతో ఆమె తల్లిగారిల్లు నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బలపాలపల్లికి వెళ్లింది. ఆమెకు కూడా పురిటినిప్పులు రావడంతో దవాఖానకు తరలించగా.. బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.

# వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులే

(మొదటి తరువాయి)

అంతకుముందు భారీ ర్యాలీ నిర్వహించిన ప్రియాంక గాంధీ, అనంతరం జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. తన కొత్త ప్రయాణాన్ని వయనాడ్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తాను రాజకీయాల కోసం ఇక్కడకు రాలేదని, ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వయనాడ్ వచ్చినట్లు తెలిపారు. రాజకీయానికంటే ఈ దేశం ముఖ్యమన్నారు. సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. తన సోదరుడు రాహుల్ గాంధీ దేశం మొత్తం తిరిగారని, ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు, వారి సమస్యలను తెలుసుకునేందుకు దేశ వ్యాప్తంగా పర్యటించినట్లు చెప్పారు. వయనాడ్ ప్రజలకు అండగా ఉండేందుకు తాను ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలతో కలిసి పోరాడేందుకు, వారి సమస్యల పరిష్కారానికి వయనాడ్‌కు వచ్చినట్లు తెలిపారు. వయనాడ్ ప్రజల తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ఇక్కడకు వచ్చానన్నారు. రాహుల్ మాట్లాడుతూ..తనకులాగే వయనాడ్ నుంచి తన సోదరి ప్రియాంకగాంధీని ఆశీర్వదించాలన్నారు. వయనాడ్ నుంచి అధికారికంగా ఒకరు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తే.. మరొకరు అనధికారికంగా వయనాడ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తామన్నారు. ఇక్కడి ప్రజల కోసం తాను ఎప్పటికీ పోరాడుతూనే ఉంటానన్నారు. తన తల్లి ఇక్కడ ఉన్నారని, తండ్రి చనిపోయిన తర్వాత తన సోదరి ప్రియాంక గాంధీ అమ్మను చూసుకుంటున్నార్నారు. ప్రియాంక 17 ఏళ్ల వయసులో తండ్రిని కోల్పోయిందని, అయినప్పటికీ తమ తల్లికి తోడుగా నిలిచిందని రాహుల్ తెలిపారు. ప్రియాంకగాంధీ కుటుంబం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు.



వయనాడ్ ప్రజలే ప్రియాంక కుటుంబమన్నారు. ఆ కుటుంబం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. వయనాడ్ ప్రజలకు తన సోదరిని అప్పగిస్తున్నానని, ప్రియాంక గాంధీని ఇక్కడి ప్రజలే రక్షించుకోవాలన్నారు. అనధికార ఎంపీగా తాను కూడా తరచూ వయనాడ్‌కు వస్తుంటానని రాహుల్ గాంధీ తెలిపారు. వయనాడ్ సభలో సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గేతో పాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు. వయనాడ్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేస్తుండగా.. లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) నుంచి సీపీఐకి చెందిన సత్యన్ మొకేరి, బీజేపీ నుంచి నవ్య హరిదాస్ పోటీచేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ తన రాజకీయ అనుభవం ఆధారంగా ప్రియాంక గాంధీకి సవాలు విసిరారు. సింగపూర్, నెదర్లాండ్స్‌లో పనిచేసిన నవ్య కోజికోడ్ కౌన్సిలర్‌గా ఉన్నారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగుతున్న ప్రియాంక గాంధీ నామినేషన్ దాఖలు చేయడానికి ముందు వయనాడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు ఇతర సీనియర్ నేతలు పాల్గొనగా.. ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. భారీ సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేసుకుంటూ ప్రియాంక, రాహుల్ ముందుకుసాగారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ర్యాలీలో రాహుల్, ప్రియాంక ఉత్సాహంగా కనిపించారు. మధ్యలో కాంగ్రెస్ శ్రేణులకు రాహుల్ ఫ్లయింగ్ కిస్ ఇచ్చారు. అలాగే రాహుల్, ప్రియాంక తన ర్యాలీ దృశ్యాలను స్వయంగా ఫోన్‌లో చిత్రీకరించారు. ర్యాలీకి ముందు పార్టీ నాయకుల సమక్షంలో ప్రియాంక గాంధీ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ర్యాలీ తర్వాత పార్టీ కార్యకర్తలు, అభిమానుల ను ఉద్దేశించి ప్రియాంక గాంధీ ప్రసంగించారు. వయనాడ్ ప్రజలకు సేవ చేసేందుకు తాను ఇక్కడి నుంచి పోటీచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తారని ప్రచారం జరిగినా ఆమె పోటీకి దూరంగా ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం మాత్రమే నిర్వహించారు. వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక నేపథ్యంలో ఆమె ఇక్కడి నుంచి పోటీచేస్తున్నారు.

# నాంపల్లి కోర్టుకు హాజరైన కేటీఆర్

(మొదటి తరువాయి)

దెబ్బతిన్నాయని, పబ్లిసిటీ కోసమే ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. కేటీఆర్ వెంట సాక్షులు దాసోజు శ్రవణ్, సత్యవతి రాథోడ్, బాల్కసుమన్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నాంపల్లి కోర్టుకు వచ్చారు. కేటీఆర్‌తో పాటు దాసోజు శ్రవణ్ వాంగ్మూలాలు నమోదు చేసిన నాంపల్లి కోర్టు.. మిగిలిన సాక్షుల వాంగ్మూలాలను ఈనెల 30న నమోదు చేయనుంది మంత్రి కొండా సురేఖ తన పరువు, ప్రతిష్ట దెబ్బ తీసే విధంగా మాట్లాడిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం నాంపల్లి కోర్టుకు తెలిపారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నాంపల్లి ప్రత్యేక కోర్టును ఈ సందర్భంగా కేటీఆర్ అభ్యర్థించారు. గత 18 ఏళ్లుగా రాజకీయ జీవితంలో తాను ఉన్నానన్నారు. అయితే ఆమె.. తన మాటలతో తానను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నాంపల్లి కోర్టులో మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిగింది. అందులోభాగంగా కేటీఆర్ నాంపల్లి ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. రాజకీయ కక్ష్య సాధింపు చర్యలో భాగంగానే ఆమె ఇలాంటి వాక్యాలు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. సమాజంలో తనకు మంచి పేరు ప్రతిష్టలు ఉన్నాయని.. అయితే వాటిని దిగజార్చాలానే ఆమె ఈ తరహా వాఖ్యలు చేసిందని కోర్టుకు కేటీఆర్ విన్నవించారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని ఆధారాలను సమర్పించినట్లు కోర్టుకు తెలిపారు. ఆ క్రమంలో యూట్యూబ్ లింక్స్‌తోపాటు పేపర్ స్టేట్‌మెంట్స్ సైతం కోర్టుకు ఇచ్చానని ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పారు. ఈ నేపథ్యంలో చట్ట ప్రకారం మంత్రి కొండ సురేఖపై చర్యలు తీసుకోవాలని కోర్టుకు ఆయన కోరారు. కేటీఆర్ వ్యాఖ్యలపై కోర్టు స్పందించింది. మంత్రి కొండ సురేఖ ఏమి వాఖ్యలు చేసిందని కేటీఆర్‌ను ప్రశ్నించింది. దీంతో ఫిర్యాదు కాపీలో వివరాలన్నీ సమగ్రంగా ఉన్నాయని కోర్టుకు కేటీఆర్ తరపు న్యాయవాది తెలిపారు. దీంతో వాటినే ప్రామాణికంగా తీసుకోవాలా? లేకుంటే స్టేట్మెంట్ ఇస్తారా? అని కోర్టు మళ్లీ ప్రశ్నించింది. ఆ వెంటనే మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. మంత్రి కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలు చాలా అసహ్యంగా ఉన్నాయన్నారు. ఆ వివరాలు చెప్పమంటే చెప్తానని కోర్టుకు కేటీఆర్ తెలిపారు. హీరో నాగ చైతన్య, హీరోయిన్ సమంతా విడాకుల అంశంలో తెలంగాణ మంత్రి కొండా సురేఖ తనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ నాంపల్లి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. అయితే ఈ కేసులో మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ రూ. 100 కోట్ల పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. నాగ చైతన్య, సమంత విడాకులకు కారణం కేటీఆర్ అంటూ మంత్రి కొండా సురేఖ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా.. కేటీఆర్ వల్ల చాలా మంది హీరోయిన్లు.. త్వరగా పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడిపోయారన్నారు. కొండ సురేఖ చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీంతో టాలీవుడ్ ప్రముఖులు సైతం స్పందించారు. కొండా సురేఖ వ్యాఖ్యలను ఖండించారు. ఇక టాలీవుడ్ హీరో అక్కినేని నాగార్జున సైతం మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. మరోవైపు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు మంత్రి కొండ సురేఖ మీడియా ముందు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## నీ తాటాకు చప్పళ్లకు భయపడే వాళ్లం కాదు

(మొదటి తరువాయి)

భయపడేది లేదు. నాపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే. అందుకు బదులుగానే నేను మాట్లాడాను. ఆయన బాగోతం ప్రజలకు తెలుసు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసు. ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చాను. లీగల్ నోటీసులకు నోటీసులతోనే బదులిస్తా. మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులం. చట్టం, న్యాయం ప్రకారం ముందుకు వెళ్తాం అని అని బండి సంజయ్ పేర్కొన్నారు. తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ కేంద్రమంత్రి బండిసంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసు పంపిన విషయం తెలిసిందే. తాజాగా కేటీఆర్ లీగల్ నోటీసుపై కేంద్రమంతి ఘాటైన జవాబిచ్చారు. తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు. రాజకీయంగా ఎదుర్కోలేక నోటీసులా.. విమర్శలకు నోటీసులే సమాధానమా.. అయితే నీకు నోటీసులు పంపుతా... కాచుకో. నువ్వు సుద్దపూస అనుకుంటున్నవా.. నన్ను అవమానిస్తూ మాట్లాడితేనే బదులిచ్చిన. మాటకు మాట... నోటీసుకు నోటీసుతోనే జవాబిస్తా అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చారు. మాజీ మంత్రి కేటీఆర్ తనకు లీగల్ నోటీసు పంపినట్లు మీడియాలో చూసినట్లు తెలిపారు. లీగల్ నోటీసుతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీస్ ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోందని... స్పష్టం చేశారు. తనపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే అని చెప్పుకొచ్చారు. అందుకు బదులుగానే మాట్లాడినట్లు తెలిపారు.కేంద్రమంత్రి బండి సంజయ్‌కు మాజీ మంత్రి కేటీఆర్ లీగల్ నోటీసులు ఇచ్చారు. తన పరువుకు నష్టం కలిగేంచేలా వ్యాఖ్యలు చేశారని .. వారం రోజుల్లో బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే లీగల్ యాక్షన్ తప్పదని హెచ్చరించారు.

## దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

(మొదటి తరువాయి)

నిర్ణయించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.2700 కోట్ల భారం పడుతుందని మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఉచిత ఇసుక విధానంలో సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీనరేజ్ ఛార్జీల రద్దు వల్లే ప్రభుత్వంపై రూ.264 కోట్ల భారమని అంచనా వేశారు. ఉచిత ఇసుక లక్ష్యం నెరవేర్చేందుకు నష్టం భరిద్దామని సీఎం చంద్రబాబు చెప్పినట్టు సమాచారం. పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలని మంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించారు. ఇసుక విధానాన్ని అతిక్రమిస్తే ... పిడి యాక్ట్ పెట్టాలని కూడా ఆదేశించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పార్థసారధి, అనిత, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర వివరించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఇసుక సీనరేజ్, జీఎస్టీ ఛార్జీలు రద్దుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. పూర్తిగా ఉచితంగా ఇసుకను అందజేస్తున్నామని తెలిపారు. ఉచిత ఇసుకతో వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఉచిత ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఇసుక కొరత ఉన్న ఐదు జిల్లాలో ప్రత్యామ్నయ్య పాయింట్లు ఏర్పాట్లు చేయనున్నా మని వివరించారు. ఉచిత ఇసుకను ఇతర సరిహద్దు రాష్ట్రాలకు తరలించకుండా చెక్‌పోస్టులను బలోపేతం చేస్తామని, నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలన్నింటినీ ఈ పోర్టల్ గెజిట్‌లో పొందుపరిచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రూ. 20 కోట్ల ఆదాయం వచ్చే దేవాలయాల కమిటీల్లో ఇదివరకు ఉన్న 15 మంది గల సభ్యుల సంఖ్యను 17 కు పెంచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుల్లో బ్రాహ్మణులకు, నాయీ బ్రాహ్మణులకు సభ్యత్వం ఇవ్వాలని నిర్ణయించారు.

## సరిహద్దుల్లో శాంతి భద్రత

(మొదటి తరువాయి)

ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. సరిహద్దు గస్తీపై జరిగిన ఒప్పందాన్ని ఇరువురు నేతలు స్వాగతించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం ఇరు దేశాల ప్రాధాన్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల తర్వాత అధికారికంగా సమావేశం అవుతున్నాం. భారత్-చైనా సంబంధాలు ఇరు దేశాల ప్రజలకే కాకుండా ప్రపంచ శాంతి, సుస్థిరత, పురోగతికి ఎంతో ముఖ్యమని విశ్వసిస్తున్నాం. గత నాలుగేళ్లుగా సరిహద్దులో తలెత్తిన సమస్యలపై ఇటీవల వచ్చిన ఏకాభిప్రాయాన్ని స్వాగతిస్తున్నాం. సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం మన ప్రాధాన్యంగా ఉండాలి. పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం అనేవి మన సంబంధాలకు ప్రాతిపదికగా ఉండాలి‘ అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గత ఐదేళ్లలో మోదీ-జిన్‌పింగ్‌లు అధికారికంగా చర్చలు జరపడం ఇదే తొలిసారి. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ కీలక గస్తీ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో వీరి భేటీ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

## దూసుకొస్తున్న దావా తుఫాన్

(మొదటి తరువాయి)

200 రైళ్ల సర్వీసులను రద్దు, దారిమళ్లించినట్లు సమాచారం. మరోవైపు, ఈ తుపానుతో ఒడిశా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే 23వ తేదీ నుంచి 25 వరకు జరగాల్సిన పరీక్షలన్నింటినీ రద్దు చేసింది. ఈ నెల 27న జరగాల్సిన ఒడిశా సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షను సైతం వాయిదా వేశారు. కొత్త తేదీని తర్వాత ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, ఈ నెల 24, 25 తేదీల్లో నందన్‌కానన్ జూ, బొటానికల్ గా÷-డ్గ÷న్‌లకు సందర్శకులను అనుమతించరాదని నిర్ణయించారు. అలాగే, నేటి నుంచి ఈనెల 25 వరకు సిమిలిపాల్ టైగర్ రిజర్వు, భిటార్కనిక జాతీయ పార్కులను మూసివేస్తున్నట్లు తెలిపారు. తుపాను సమయంలో మూగ జీవాలకు ఆశ్రయం కల్పించాలని మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జంతువులు ఏవైనా గాయపడినట్లు గుర్తిస్తే.. 1962 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

## హైడ్రాపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

(మొదటి తరువాయి)

పార్టీ చీఫ్ కేఏ పాల్ వేసిన పిల్‌ను హైకోర్టు బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. భవనాలను కూల్చివేయకుండా హైడ్రాకు ఆదేశాలు జారీ చేయాలని పాల్ వాదించారు. బాధితులకు నోటీసులు జారీ చేయాలనీ, వారు ఇండ్లు ఖాళీ చేయడానికి లేదా కోర్టుల్లో కేసులు వేసేందుకు సమయం ఉండేలా నోటీసులు ఉండాలని కోరారు. పేదలను గుర్తించి పునరావాసం కల్పించాలని కోరారు. మూసీ రివర్‌బెడ్‌లో నిర్మాణాల కూల్చివేతలకు ముందు అధికారులు ఆ ఇండ్లకు మార్కింగ్ చేశాక చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నామనీ, బాధితులకు పునరావాస చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వం తరఫున అదనపు ఏజీ ఇచ్చిన హామీని హైకోర్టు రికార్డు చేసింది. పరిహారంపై సంప్రదిపులు చేశాకే అక్రమ నిర్మాణాల కూల్చివేత చేపడుతున్నామన్నారు. హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకే కూల్చివేతలు ఉంటాయని హైడ్రా లాయర్ చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు ధర్మాసనం, స్టే జారీ చేయాల్సిన పరిస్థితులు లేవంటూ తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. అప్పటిలోగా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు హైడ్రాను ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## తిరుమలలో టిక్కెట్ల దందా వ్యవహారం

(మొదటి తరువాయి)

పేరిట విఐపి బ్రేక్ దర్శనం ఇప్పిస్తామని.. దళారులు భక్తుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే.. ఇటీవల ఇదే విషయంలో ఏపీకి చెందిన ఓ ఎమ్మెల్సీ పై కూడా కేసు నమోదైంది.. బ్రేక్ టికెట్ల పేరిట డబ్బులు వసూలు చేసినట్లు ఆమెపై కేసు నమోదైంది. ఈ తరుణంలోనే ఓ రాష్ట్రానికి చెందిన సీఎం పేరుతో ఏకంగా.. ఆయన లెటర్ హెడ్ తో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను అమ్మేందుకు ప్రయత్నించి ఓ దళారీ అడ్డంగా బుక్కయ్యాడు. పాండిచ్చేరి సీఎం లేఖ ద్వారా విఐపి బ్రేక్ దర్శనం టికెట్లను ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేస్తున్న దళారికి తిరుమల పోలీసులు అతనికి దిమ్మతిరిగేలా చెక్ పెట్టారు. పుదుచ్చేరి సీఎం లేఖ ద్వారా వీఐపీ బ్రేక్ టికెట్లను విక్రయిస్తుండగా దళారీ బద్మనాభం అలియాస్ భరత్ ను తిరుమల టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మనాభం ఈ నెల 21 న నెల్లూరుకు చెందిన ఐదుగురు భక్తులకు విఐపి బ్రేక్ దర్శనం ఇప్పిస్తానని రూ. 23 వేలు తీసుకున్నాడు.. విఐపి దర్శనం టికెట్స్ కాకుండా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను ఇప్పించాడు. విఐపి దర్శనం టికెట్లు రాకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని నెల్లూరుకు చెందిన భక్తుడు విజయ్ కుమార్.. డిమాండ్ చేశారు. డబ్బులు తిరిగి ఇచ్చేందుకు బద్మనాభం నిరాకరించడంతో విజయ్ కుమార్ టిటిడి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.. ఈ మేరకు భక్తుడు తిరుమల టూ టౌన్ పిఎస్ లో ఫిర్యాదు చేశాడు.. దీంతో అతని స్టేట్‌మెంట్‌ను విజిలెన్స్ ఇన్స్పెక్టర్ శంకర్ బాబు రికార్డ్ చేశారు..

## మూసీ సుందరీకరణ కాదు.. మురికిని నివారించండి

(మొదటి తరువాయి)

ఉన్నాయి. అయినా, మాకు ఆందోళనగానే ఉంది. మీరే మమ్మల్ని కాపాడాలి. మూసీ సుందరీకరణ కంటే మా ఇళ్లే ముఖ్యం. సుందరీకరణ కంటే ముందు డ్రైనేజీ క్లీన్ చేయండి. సియోల్ వెళ్లిన బృందం చూపిస్తుంది కదా.. తెల్లటి నీళ్లు. ఇక్కడ కూడా అలా చేస్తే మేమే వెళ్లిపోతాం. మేం కట్టుకున్న మంచి ఇళ్లు వదిలి.. డబుల్‌బెడ్రూమ్ ఇళ్లకి ఎలా వెళ్లగలం? వీళ్లు పెట్టే టెన్షన్‌కి ఆరోగ్యాలు పాడవుతున్నాయి. రూ.కోట్లు ఇచ్చినా.. మా ప్రాణాలు పోయినా మేం ఇక్కడి నుంచి కదలం అని పలువురు నిర్వాసితులు ఈటల వద్ద సమస్యలు ఏకరువు పెట్టారు

## సంపాదకీయం

# రాజకీయాల్లో కుటుంబాల తిష్ట !

భారత రాజకీయ వ్యవస్థ మొత్తం కుటుంబ రాజకీయాలకు ఆలవాలంగా ఉంటోంది. కుటుంబ రాజకీయాలకు దూరంగా ఉండాలన్న కల సాకారం కావడం లేదు. కాంగ్రెస్‌లో కుటుంబ రాజకీయాలు పెనవేసుకు పోయాయి. అలాగే ప్రాంతీయ పార్టీల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది. ఒక్క కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరూ రాజకీయాల్లో ఉండాలనుకుంటున్నారు. తాజాగా ప్రియాంక వాద్రా కూడా వయనాడ్ ద్వారా రాజకీయ అరంగేట్రం చేయడం చూస్తే ఇది మరోమారు స్పష్టం అవుతుంది. ఒక్కొక్కరు రెండమూడు చోట్లా పోటీ చేయడం, గెలిచాక మరొకరిని దింపడం వంటివన్నీ ఖజానాపై భారం పడేలా చేస్తున్నాయి. తొలుత ఒక్కచోటే పోటీ చేసేలా చట్టం రావాలి. అలాగే కుటుంబంలో ఒక్కరికే రాజకీయ ప్రవేశం ఉండేలా చేయాలి. అప్పుడే దేశ ప్రజాస్వామ్యంలో ఇతరులకు చోటు దక్కుతుంది. రాజీవ్ కుటుంబంలో ఇప్పుడు మరొకరు అంటే ప్రియాంక రాకతో పార్టీ పూర్తిగా వారి గుప్పిట్లోకి వెళుతోంది. రేపు ఎక్కడో ఒకచోటు నుంచి రాబర్ట్ వాద్రా కూడా రాజకీయ ప్రస్తానం మొదలవుతుంది. రాహుల్ ఇప్పటికే వయనాడ్ వదులుకోవడంతో ప్రియాంక ఎంటర్ అవుతున్నారు. రాహుల్ రాయబరేలిని దక్కించుకున్నారు. సోనియా రాజ్యసభలో ఉన్నారు. ఇంట్లో ఉన్న ముగ్గురూ ఎంపిలుగా ఉండబోతున్నారు. రాబర్ట్ కూడా వస్తే వారింట్లోనే నలుగురు అవుతారు. ఇది ఎంతవరకు న్యాయమో ప్రజలు ఆలోచన చేయాలి. ఇలా కుటుంబంలోని అందరినీ చట్టసభలకు పంపితే వారికి దేశం పట్ల ఏమాత్రం బాధ్యత, చిత్తశుద్ది ఉంటుందో ప్రజలు ఆలోచించాలి. సోనియా కుటుంబంతో పాటు లాలూ ప్రసాద్ కుటుంబం, ఫరూక్ అబ్దుల్లా కుటుంబం, అమిత్ షా కుటుంబం, చంద్రబాబు కుటుంబం,కెసిఆర్ కుటుంబం, వెంకటస్వామి కుటుంబం.. కరుణానిధి కుటుంబం...ఇలా చెప్పు కుంటూ పోతే రాజకీయాల్లో అన్నీ కుటుంబాల అజమాయిషీలోకి వెళ్లాయి. వీరికి కుటుంబ అవసరాలు, స్వార్థం తప్ప ప్రజల గురించి ఆలోచన ఉండదు. భారత జనాభా 140 కోట్లకు చేరిన క్రమంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు అందుకే నెరవేరడం లేదు. పాలకులు ఎప్పుడూ వీరే కావడం, కొత్తవారికి అవకాశం లేకపోవడంతో మార్పులు కానరావడం లేదు. కుటుంబ పార్టీలు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాయి. అందుకే పాలనలో కొందరే నిరంతరంగా ఉండే విధానం పోవాలి. పార్లమెంట్, అసెంబ్లీలకు ఒక్కరినే నిరంతరంగా ఎన్నుకునే విధానం కూడా మంచిది కాదు. ఈ క్రమంలో రాజకీయాల్లో రొటేషన్ పద్దతి రావాలి. కుటుంబా లను దూరం పెట్టేలా సంస్కరణలు చేయాలి. ఒక్కరు ఒక్కచోటు నుంచే పోటీ చేయించగలగాలి. ఒక్కరికి రెండు పర్యాయాలు మించి అవకాశం లేకుండా చేయాలి. లేకుంటే వరుస పెట్టి వ్యాపారంలో లాగా అంతా రాజకీయాల్లో చేరి రాజకీయాలను, పాలనను వ్యాపారంగా మారుస్తున్నారు. అమెరికా తరహాలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే ఎన్నికల్లో పోటీచేసే విధానం రావాలి. ఒక్కరే ఏళ్లతరబడి ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఉండకుండా రెండు టర్మ్‌ల కాలాన్ని గరిష్టంగా నిర్ణయించాలి. ఈ మేరకు రాజ్యాంగంలో సవరణలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఇప్పుడు ప్రియాంక రావడంతో మొత్తం సోనియా కుటుంబం పెత్తనంలోకి పార్టీ వెళ్లిపోయింది. ఖర్గే పేరుకే కాంగ్రెస్ అధ్యక్షుడు అని చెప్పాలి. లాలూ పార్టీ కావచ్చు, కెసిఆర్, కరుణానిధిల పార్టీలు కావచ్చు... వారే రాజ్యాం ఏలుతున్నారు. రాజకీయా లను మారిస్తేనే యువతకు అవకాశం వస్తుంది. యువత రాజకీయల్లోకి వస్తే మార్పులు కూడా వస్తాయి. దేశం పురోగమిస్తుంది. అందుకే ఎన్నికల్లో పోటీ చేసేవారికి అర్హతలను కూడా నిర్ణయించాలి. ఇలా అర్హతలు లేకపోవడం వల్లనే స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ఫలాలు అందరికీ అందడంలేదు. కొందరే పాలకులుగా ఉంటూ..ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తున్నారు. అందుకే 75 ఏళ్ల స్వాతంత్ర్యోత్సవంలో ఇంకా పేదలు పేదలుగానే ఉన్నారు. ఆకలి కోసం అలమటిస్తున్న వారు అలాగే ఉన్నారు. రాజకీయ నేతలు కూడా పేదల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారు. ఇదంతా కూడా ప్రజలు కోరి తెచ్చుకున్న దౌర్భాగ్యంగా చూడాలి. మనం వేసే ఓటు సక్రమంగా పనిచేస్తుందా లేదా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇలా రాజకీయ కుటుంబాలను మోయాల్సిన ఖర్మ మనకు లేదని గుర్తించాలి. కుటుంబ పార్టీలను దూరం పెట్టడం అలవాటు చేసుకోవాలి. వారికి ఓటేయకుండా గట్టిగా నిలబడాలి. మన ఓటును ఆయుధంగా చేసుకుని కుటుంబ సంక్షేమం కోసం పాటుపడే దగుల్బాజీ రాజకీయాలకు చరమగీతం పాడాలి. ప్రజలు పట్టించుకోని కారణంగా పాలకులు రాజకీయాలను వ్యాపారంగా మార్చుకుని, అధికారం చేతబట్టి శాసిస్తున్నారు. ప్రజలను ఓటుబ్యాంకుగా తయారుచేసుకుని వారిని మభ్యపెట్టడం అలవర్చుకున్నారు. ఎన్నికల అక్రమాల్లో ఆరితేరిన నేతలంతా పాలకులుగా పెత్తనం చెలాయిస్తున్నారు. ఓట్లను కొనుగోలు చేయడం ఎలాగో నేర్చుకున్నారు. తమకు అనుకూలమైన ఎన్నికల అధికారులను, పోలీస్ అధికారులను అడ్డం పెట్టుకుని ఓట్లను వేయించుకుని ఎన్నికవుతున్నారు. ఈ విధానం పోవాలంటే ఎన్నికల్లో భారీ సంస్కరణలు రావాలి. ఒక్కరే నిరంతరంగా పదవిని పట్టుకుని ఉండే పద్దతికి స్వస్తి పలకాలి. కుటుంబాల నుంచి ఒక్కరికే ఛాన్స్ అన్నది రావాలి. ఎంపి, లేదా ఎమ్మెల్యేగా గెలిచిన వారు రెండు టర్మ్‌లకు మించి పనిచేయకుండా చట్టబద్ద విధానం అమల్లోకి తీసుకుని రావాలి. జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నది కేవలం ఓటమికి భయపడే అని ప్రజలు గుర్తించాలి. తరచూ ఎన్నికలు దేశ ఖజానాను దోచేస్తున్నాయి. జమిలి ఎన్నికలకు నిలబడ్డ బిజెపి, ఇలాంటి సంస్కరణ లను కూడా తేవాలి. కుటుంబ పార్టీలను దూరం పెట్టాలి. లేదా కుటుంబంలో ఒక్కరే రాజకీయాలకు అర్హులుగా చేయాలి. అప్పుడే మార్పు వస్తుంది. అప్పుడే ఇంటిల్లిపాదీ రాజకీయాల్లో చేరి ప్రజల నెత్తిన కూర్చునే ఖర్మ తప్పుతుంది. ప్రజాస్వామ్యం బలపడుతుంది.

# 'మహా' యుద్ధంలో గెలుపు ఎవరిది?

హరియాణా ఎన్నికల ఫలితాల తర్వాత సర్వేలు నిర్వహించేవారు చాలా స్తబ్దంగా కనపడుతున్నారు. నవంబర్ 20న జరిగే మహారాష్ట్ర ఎన్నికల గురించి అడిగితే చాలా ఆచితూచి స్పందిస్తున్నారు. సర్వేలు నిర్వహించేవారు మాత్రమే కాదు, ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించేవారికి కూడా ఏమీ అంతుబట్టడం లేదు. మహారాష్ట్రలో వారు యథా ప్రకారం ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించే సాహసం చేస్తారా లేదా అన్నది చెప్పలేం. హరియాణాలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ఒక్క సర్వే కానీ, ఎగ్జిట్‌పోల్స్ కానీ వెల్లడించలేదు. అదే విధంగా జమ్ముకశ్మీర్‌లో హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని అంచనా వేసినవారు కూడా నేషనల్ కాన్ఫరెన్స్%-కాంగ్రెస్ కూటమి మెజారిటీ సీట్లు సాధిస్తుందని ఊహించలేకపోయాయి. ఇప్పుడే కాదు, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించిన 12 సంస్థలు ఎన్డీఏ 400 సీట్లు దాటుతుందని చెప్పి బోల్తా పడ్డాయి. అసలు మన దేశంలో ఎగ్జిట్‌పోల్స్, సర్వే సంస్థలు ఎందుకు విశ్వసనీయత కోల్పోతున్నాయి? గల్లీకొక్కటిగా పుట్టగొడుగుల్లా ఏర్పడిన సంస్థల గురించి పెద్దగా మాట్లాడనక్కర్లేదు కాని ఒకప్పుడు కచ్చితంగా అంచనా వేయగలవని గుర్తింపు తెచ్చుకున్న సంస్థలు కూడా ఎందుకు విఫలమవుతున్నాయి? వాటిలో వృత్తి నైపుణ్యం లోపించిందా? లేదా ఈ సంస్థలు కూడా సోషల్ మీడియా సంస్థల్లాగా గాలివాటంగా జనంలో వినపడుతున్నది బయటకు వదిలేస్తున్నాయా? అన్న అనుమానం వస్తోంది. యూట్యూబ్‌ల్లో సర్వేరాయుళ్లు, ఏదో ఒకటి మాట్లాడే విశ్లేషకులు ఆవిర్భవించాక వారిని కూడా మేనేజ్ చేసే నేతల పీఆర్ బృందాలు బయలుదేరాయి. 'మీరు ఆయనను గొప్ప విశ్లేషకుడు అనుకుంటారు.. ఆయనకు గత ఎన్నికల్లో ఎంత చెల్లించామో తెలుసా?' అని రాష్ట్రంలో ఒక నేతకు పనిచేసిన పీఆర్వో ఒకరు అడిగారు. అందువల్ల మనకు వచ్చే సమాచారం విశ్వసనీయతను గ్రహించడం చాలా కష్టం.రాజకీయ నాయకులు తమ పార్టీని, అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రైవేట్ సంస్థల్ని నియమించుకుని విజయం కోసం ప్రయత్నించే ప్రక్రియ మన దేశ రాజకీయాల్లో ఆలస్యంగా ప్రవేశించింది. కాని సంస్థల్ని నిర్వహించే వ్యూహకర్తల విశ్వసనీయత కూడా క్రమక్రమంగా తగ్గడం ప్రారంభమైంది. గత ఎన్నికల్లో ఏపీలో వైసీపీ తాను అఖండ విజయం సాధిస్తానని భావించింది. తమ తరఫున వ్యూహరచన చేసిన సంస్థ ప్రతినిధులను వైసీపీ అధినేత ఫలితాలు రాకముందే సత్కరించారు. కాని వైసీపీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయింది. కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్‌లో చక్రం తిప్పిన ఒక ప్రైవేట్ వ్యూహకర్తకు సలహాదారుగా కేబినెట్ హోదా కూడా




కల్పించారు. నేతలు టిక్కెట్ల కోసం ఆయన చుట్టూ తిరిగారు. కాని రాజస్థాన్, మధ్యప్రదేశ్, హరియాణాలో ఆయన వ్యూహం ఫలించలేదు. సర్వేల ఆధారంగా టిక్కెట్లు పొందినవారు అనేకమంది పరాజయం పాలయ్యారు. ఇందుకు వ్యూహకర్తనే తప్పుపట్టలేం కాని ఇలా ఎందుకు జరుగుతోంది? నిజానికి ఏపీలో ఏ వ్యూహకర్తతో నిమిత్తం లేకుండా ప్రజలు తీర్పు చెప్పారు. తెలంగాణలో కూడా కేసిఆర్ చేసిన తప్పిదాల వల్ల బీఆర్ఎస్ ఓటమి పాలైందని స్పష్టంగా తేలింది కాని ఏ వ్యూహకర్తవల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పలేం. ప్రజలు వ్యూహకర్తలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాలనపై, రాజకీయ పార్టీల తీరుతెన్నులపై ఆధారపడి తీర్పునిస్తారన్న విషయం అనేక సందర్భాల్లో వెల్లడైంది. ఎమర్జెన్సీ తర్వాత జనతా పార్టీ విజయానికి ఏ వ్యూహకర్తా కారణం కాలేదు. 2014లో నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభంజనానికి కానీ, 2024లో బీజేపీ సీట్లు తగ్గడానికి కూడా పూర్తిగా వ్యూహకర్తలు కారణమని చెప్పలేము. కాకపోతే ఒక పార్టీకి ప్రజాభిప్రాయం అనుకూలంగా ఉంటే ఆ వాతావరణాన్ని సంఘటితం చేసేందుకు కొన్ని సంస్థలు తోడ్పడవచ్చు కాని ఈ సంస్థలే రాజకీయ పార్టీల తలరాతల్ని నిర్ణయించలేవు. అందువల్ల నేతలు ఎప్పుడూ ప్రజలతో నిత్యసంబంధాలు ఏర్పర్చుకుంటూ, వారికోసం పనిచేస్తూ ఉండక తప్పదు.ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో మహారాష్ట్రలో ఏ కూటమి గెలుస్తుంది అన్న విషయంపై అనేకమంది రాజకీయ పరిశీలకుల్లోనే అయోమయం నెలకొన్నది. నాలుగు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 48 సీట్లలో కేవలం 9 సీట్లలోనే బీజేపీ విజయం సాధిస్తే ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు 7, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీకి ఒక సీటు లభించాయి. మరో వైపు కాంగ్రెస్‌కు 12, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేనకు 9, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీకి 8 సీట్లు లభించాయి. ఉత్తరప్రదేశ్‌లో మాదిరి మహారాష్ట్రలో కూడా మోదీ ప్రభంజనం అంతగా పనిచేయలేదు. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఈ ఎన్నికల్లో 12 సీట్లు కోల్పోయింది. దేశంలో రెండుసార్లు బీజేపీకి పూర్తి మెజారిటీ సాధించిన సందర్భాల్లో కూడా మోదీ మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వం రాకుండా చేయలేకపోయారు. 1995 నుంచి దాదాపు మూడు దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాలే కొనసాగుతున్నాయి. కేవలం ఒకే ఒక్కసారి బీజేపీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. రెండోసారి దొడ్డి దారిన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించి అయిదు రోజుల్లోనే ఇంటి దారి పట్టింది. ఆ తర్వాత శివసేనను, ఎన్‌సీపీని చీల్చి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసినా అధికారం మాత్రం శివసేన చీలిక వర్గానికి చెందిన ఏకనాథ్ షిండేకు అప్పగించక తప్పలేదు. ముఖ్యమంత్రి పదవి నిర్వహించిన దేవేంద్రనాథ్ ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రి పదవితో సంతృప్తిపడాల్సి వచ్చింది. ఇప్పుడైనా ఒకవేళ బీజేపీ అత్యధిక సీట్లు సాధించి గెలిచినా మహారాష్ట్రలో ప్రభుత్వం ఏర్పాటు చేయగలదా? లేదా ఏక్‌నాథ్ షిండేకే మళ్లీ ముఖ్యమంత్రి పదవి అప్పగించక తప్పదా? లోక్‌సభ ఎన్నికల ఫలితాల తీరు తెన్నులను బట్టి చూస్తే షిండే ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతితో పోలిస్తే ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అగాధి బలంగా ఉన్నదని చెప్పవచ్చు. శివసేన, ఎన్‌సీపీని బీజేపీ చీల్చిన తీరు, ప్రతిపక్షాలపై ఈడీ, ఆదాయపు పన్ను కేసులు మోపిన తీరు పట్ల జనం తమ వ్యతిరేకతను లోక్‌సభ ఎన్నికల్లో ప్రదర్శించారు. అధిక ధరలు, నిరుద్యోగంతో పాటు వ్యవసాయ సంక్షోభం, మంచి నీటి కొరత, మరాఠా కోటా, ధారవి మురికివాడల అభివృద్ధి పథకం వంటి స్థానిక సమస్యలు అనేకం ఉన్నాయి. కాని హరియాణాలో అనూహ్యంగా బీజేపీ గెలిచిన తర్వాత మహారాష్ట్ర గురించి ఇదమిత్థంగా చెప్పేందుకు అనేకమంది పరిశీలకులు వెనుకాడుతున్నారు. హరియాణాలో మాదిరి కాంగ్రెస్ విజయావకాశాలు చేజార్చుకోవడం, శివసేనతో సీట్ల ఒప్పందం తేలకపోవడం, ముఖ్యమంత్రి సీటు కోసం కాంగ్రెస్ నేతలు పోటీ పడడం మొదలైనవి కాంగ్రెస్‌కు ప్రతికూల అంశాలుగా ఉన్నాయి. ఉద్ధవ్ ఠాక్రే వర్గం స్థానిక కాంగ్రెస్ నేతలతో కాకుండా ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో చర్చలు జరుపుతోంది. మరోవైపు ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించేందుకు మహాయుతి కూటమి వరాల వర్షం కురిపిస్తోంది.

# 'హైడ్రా'పై రాజకీయ కుట్రలు మానండి!

ఆంధ్ర తెలంగాణ కలిసిన తర్వాత అందరి దృష్టీ హైదరాబాద్ మీద పడింది. అంచనాకు మించిన జనం, కంపెనీలు వేగంగా తరలిరావడంతో దాని ప్రభావం మూసీ నది మీద పడింది. 1990 నాటికి మూసీలోకి మానవ వ్యర్థాలు, ఫ్యాక్టరీ నుంచి వచ్చే రసాయన వ్యర్థాలు కలగలిసి వచ్చి మూసీ కాలుష్య కాసారంగా మారింది. అప్పటికే ప్రధాన జలాశయాలుగా ఉన్న ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ సరస్సులను ఈ కాలుష్య కోరల నుంచి కాపాడాలన్న ప్రధాన లక్ష్యంతో నాటి పాలకులు 1996లో జీవో నెంబర్ 111 తీసుకొచ్చారు. ఈ జీవో ప్రకారం ఈ రెండు సరస్సుల చుట్టూ 10కిమీ మేర అంటే దాదాపు 1,30,000 ఎకరాల భూమి కలిగిన 84 గ్రామాలలో ఆంక్షలు విధించబడ్డాయి. వీటి ప్రకారం వ్యవసాయ భూముల్ని పారిశ్రామీకరించడానికి వీలులేదుబీ భారీ కాలుష్యకారక పరిశ్రమలు, పెద్ద పెద్ద హోటళ్లు, విశాల నివాస స్థలాలు, భారీ వినోద కేంద్రాలు నిర్మించకూడదు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల చేతుల్లో చిక్కి, ధనార్జనే పరమావధిగా భావించి జీవో నెంబర్ 111 ఎత్తివేసింది. దీంతోటే అభివృద్ధికి బాటలు పడ్డాయని అబద్ధపు ఢంకా మోగించి ప్రజల కళ్ళల్లో మరింత మురికి మట్టిని కొట్టింది నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం దగ్గరికి పర్మిషన్ల కోసం వినతులు, అలాగే పర్మిషన్లు వద్దని ప్రజల నుంచి నిరసనలు రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై దృష్టి సారించారు. సుందరమైన హైదరాబాద్ కల నిజం కావాలంటే మూసీ నది ప్రక్షాళన జరగాలని, దానికోసం 111 లాంటి జీవోనే ఉండాలని, అప్పుడే అందమైన ఆరోగ్యకరమైన భవిష్యత్ హైదరాబాద్ సాధ్యమవుతుందని అంచనాకి వచ్చారు. ఈ ఆలోచనల పరంపర నుంచే హైడ్రా ఉద్భవించింది అభివృద్ధి వైపు



వేగంగా పరుగులు పెట్టించే గొప్ప వ్యూహంగా మూసీ ప్రక్షాళన కోసం హైడ్రాను ఏర్పాటు చేశారు. రూ. 1,50,000కోట్ల అంచనా వ్యయంతో, కేవలం 36 నెలల్లోనే మూసి ప్రాజెక్టును పునర్నిర్మించి సుందరీకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో కొనసాగుతున్నారు. నది పొడవునా వాణిజ్య, వినోద, పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించనున్నారు. ఈ గొప్ప కార్యం కోసం ప్రత్యేక కమిషన్‌ను తయారు చేశారు. దీనికి చైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు. సభ్యులుగా ఉమ్మడి రంగారెడ్డి%-%హైదరాబాద్ జిల్లాల మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రెటరీ, జీహెచ్ఎంసీ మేయర్‌లు ఉంటారు. ఇట్లా పటిష్టమైన నిర్మాణం, స్పష్టమైన లక్ష్యంతో హైడ్రా ముందుకు సాగుతున్నది.దాదాపు పదేళ్ళు పాలించిన బీఆర్ఎస్ నాయకులు నాడు మూసీ ప్రక్షాళనపై కల్లబొల్లి మాటలతో మభ్యపెట్టారు. కనీసం ఒక్క అడుగు కూడా కార్యరూపం దాల్చలేదు. ఒక సంవత్సరం కూడా నిండని రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కోసం వేగంగా అడుగులేస్తుంటే ఇప్పుడు వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించిన విలాసరాయుళ్లు ఇప్పుడు కన్నీళ్లు మింగుతున్నారు. జన్వాడ ఫామ్ తమది కాదని, అది లీజు మాత్రమే అని తేలు కుట్టిన దొంగల్లాగా కొత్త రాగం అందుకుంటున్నారు. మరో బీఆర్ఎస్ నేత తన చుట్టూ ఉన్న చెరువు ఆక్రమించుకొని ఇంజనీరింగ్ కాలేజీ కట్టాడు. అనంతరం దానిని యూనివర్సిటీగా కూడా మార్చాడు. ఇప్పుడు కోర్టుకెళ్లి 'నా యూనివర్సిటీని కాపాడండి మహాప్రభో' అని పొర్లు దండాలు పెడుతున్నాడు. మరొక నేత అక్షర జ్ఞానం లేకున్నా భూకబ్జాలలో ఘనాపాటి. ఆయన తన 'మెడికల్ కాలేజ్‌ను ఇప్పుడే కూల్చవద్దు, కాస్త సమయం ఇవ్వండి' అంటూ గగ్గోలు పెడుతున్నాడు. ఇంకా మిగతా నేతల వివరాల్లోకి వెళ్తే ఇక్కడ చాట భారతం అవుతుంది. ఆక్రమించుకున్న కోట్ల విలువ చేసే భూములు తమవి కాకుండా పోతున్నవనేసరికి సినీ ప్రముఖులు, పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు, బీఆర్ఎస్ నేతలు ఒకే జట్టుకట్టి ప్రభుత్వం పైన దుమ్మెత్తిపోసే కుట్రకు తెరతీశారు. వీరికి ఇప్పుడు పేదలపై విపరీతమైన ప్రేమానురాగాలు వస్తున్నాయి. అరవై గజాలకు మించని జాగాలో ఈగలూ దోమల బాధతో, రోగాలతో చెత్తాచెదారం మధ్యన, మూసీ మురుగు ప్రక్కన బతుకుతున్న వీరి కనీస అవసరాలు ఇన్నాళ్లూ ఏ మాత్రం పట్టించుకోని వాళ్ళు, వీరికై పక్కా ఆవాసాలు నిర్మించని వాళ్లు ఇప్పుడు పేదలకు న్యాయం చేయాలంటూ సరికొత్త నాటకానికి శ్రీకారం చుట్టారు. హైడ్రా అధికారులు ఎఫ్‌టీఎల్ భూమిని గుర్తించి అక్కడ ఎఫ్‌టీఎల్ అని రాస్తే ఆ స్థానంలో కేసీఆర్ అని రాసుకోవాలని ప్రజలను రెచ్చగొట్టి కేసులపాలు చేయచూస్తున్నారు.

# పత్తి చేను పనులకు పిల్లల తరలిస్తే కేసులు నమోదు చేస్తాం





-10 మంది బాలకార్మికులను విముక్తి

-తాడూర్ ఎస్ ఐ గురుస్వామి

నాగర్ కర్నూల్ అక్టోబర్ 23: ప్రజా స్వేచ్ఛ

పత్తి చేను పనులకు పిల్లల తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తాడూర్ ఎస్ ఐ గురుస్వామి అన్నారు. పనులకు వెళ్తున్న 10మంది పిల్లల విముక్తి కల్పించడం జరిగింది. నాగర్ కర్నూల్ జిల్లా లోని తాడుర్ మండల కేంద్రము లోని పోలీస్ స్టేషన్లో ముందు నాగర్ కర్నూల్ - కల్వకుర్తి రహదారి పై బాలల సంరక్షణ అధికారి (డి సి పి ఓ), చైల్డ్ లైన్ 1098, పోలీస్ శాఖ, కొనేర్ సంస్థ ఆధ్వర్యంలో తనిఖీ లు నిర్వహించి వాహనాల లో పత్తి చేను పనులకు వెళ్తున్న బాలకార్మికుల ను విముక్తి కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా తాడూర్ ఎస్ ఐ గురుస్వామి సహకారం తో, వాహనాలు తనిఖీ చేసి అందులో పెదకోతపల్లి మండల పరిధిలోని పెద్ద కారుపాముల గ్రామం చిన్నారులు 6 మంది కలరు. అదే విధంగా సాతాపుర్ గ్రామానికి చెందిన ఒక బాలిక, కోడెర్ మండల పరిధిలోని ఎదుల గ్రామానికి చెందిన ఒక బాలిక, నాగర్ కర్నూల్ మండల కేంద్రము కు చెందిన ఇద్దరు పిల్లల విముక్తి కల్పించి నాగర్ కర్నూల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పర్చి అనంతరము కుటుంబసభ్యుల తో అవగాహన కల్పించడం జరిగింది. వెకిల్ యజమానుల కు కౌసిలింగ్ నిర్వహించి పంపించడం జరిగింది. ఈ కార్య క్రమంలో బాలల సంరక్షణ అధికారి (డి సి పి ఓ), శ్రీశైలము, చైల్డ్ లైన్ సూపర్ వేజార్ సురేష్, పోలీస్ కానిస్టేబులు వెంకటేశ్ రమేష్, స్వచంద సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ అంజేయులు.అడిసినల్ కో ఆర్డినేటర్ ఎం శ్రీనివాస్ యాదవ్. జాకీర్ హుస్సేన్ తది తరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన




ఆలేరు అక్టోబర్ 23: ప్రజా స్వేచ్ఛ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికలు, బాలుర ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ఐదు డిఏలు పెండింగ్ లో ఉన్నాయని, ప్రతిసారి పిఆర్సి అమలులో జాప్యం జరగడం సాధారణంగా మారిపోయిందని, దీనివల్ల ఉపాధ్యాయులు ఆర్థికంగా ప్రతిసారి నష్టపోతున్నారని తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యులు దూడల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల ఇలానే చిన్న చూపు చూస్తే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితం అనుభవిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మి, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి మంజుల, స్కూల్ అసిస్టెంట్ రాష్ట్ర అధ్యక్షులు పసుపులేటి నరేందర్, స్వామి, పోరెడ్డి రంగయ్య, రావుల సత్యనారాయణ రెడ్డి, ఆరు సైదులు, పరమేష్, మేఘరాజ్, శేఖర్ రెడ్డి, జె.సైదులు, సత్యనారాయణ, శ్రీధర్, మల్లేశం, జ్ఞాన ప్రసన్న, రోహిణి, హేమలత, స్వర్ణలత, రాధిక, కవిత, అలివేలు మంగమ్మ, పద్మ, కుమారి, సుదర్శన్, శ్రీనివాస్, నర్మదా తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు కుర్చీలు టేబుల్స్ అందజేసిన కొండూరు భాస్కర్



వలిగొండ అక్టోబర్ 23 ప్రజా స్వేచ్ఛ

మన ఊరి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి లో సమాజ సేవకుల పాత్ర అందరిది ఉండాలనే మంచి ఆలోచనతో స్థానికలను సంప్రదించే క్రమంలో పాఠశాల తరగతి గదులకు, ఆఫీస్ కి కొన్ని కుర్చీలు, టేబుల్స్ కావాలి అని అడిగిన వెంటనే స్పందించి ముందుకు వచ్చి ఈరోజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలకుంట శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వలిగొండ పట్టణ ప్రముఖులు కొండూరు భాస్కర్ మెడికల్ షాప్ పాల్గొని 25 వేల రూపాయల విలువ గల కుర్చీలు, టేబుల్స్ పాఠశాల కు అందించనైనది. పాఠశాల అభివృద్ధి కి చేయూత నందించిన దాత కి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధన్యవాదములు తెలియజేస్తూ ఇలాగే పుర ప్రముఖులు ఇంకా కొంతమంది ముందుకు వచ్చి మన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి లో భాగస్వాములు కాగలరని కోరనైనది. ఇట్టి కార్యక్రమం లో స్థానిక నాయకులు కాసుల వెంకన్న, మైసోళ్ల మత్స్యగిరి, కొండూరు సాయి మరియు పాఠశాల ఉపాధ్యాయులు మునగపాటి వరమ్మ, మామిడి కవిత మొదలగు వారు పాల్గొన్నారు.

## తెలంగాణలో దీపావళి హాలిడే ఎప్పుడంటే.?



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ

దీపావళి వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు,కళాశాలలకు ఒకరోజు సెలవు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 31, గురువారం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది.ప్రస్తుతం పాఠశాలలు సమ్మేటివ్ మూల్యాంకనం - 1 పరీక్షలను అన్ని తరగతులకు అక్టోబర్ 28 వరకు నిర్వహిస్తున్నాయి.ఆ తర్వాత సెలవు ఉంటుంది. దీపావళి జరుపుకోవడంపై ఓ కన్ఫ్యూజన్ నెలకొంది. దీపావళి అమావాస్య తిథి అక్టోబర్ 31న మధ్యాహ్నం 3:12 గంటలకు ప్రారంభమవుతుంది.ఇది నవంబర్ 1న సాయంత్రం 5:14 వరకు ఉంటుంది.సాధారణంగా అమావాస్య తిథి నాడు రాత్రి లక్ష్మీపూజ చేస్తారు.అందుకే అక్టోబర్ 31నే దీపావళి జరుపుకోవాలని పండితులు సూచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,తమిళనాడు,గోవా, కర్ణాటక,కేరళ,పుదుచ్చేరి వంటి రాష్ట్రాల్లో దీపాల పండుగను అక్టోబర్ 31వ తేదీనే జరుపుకుంటారు.అందుకే ఈ తేదీన సెలవు ప్రకటించారు.

## చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తా

-జనగామ డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి

-చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం కొమ్మూరికి జేఏసీ వినతి

ప్రజా స్వేచ్ఛ చేర్యాల

చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు కోసం త్వరలో ముఖ్యమంత్రిని కలిసి డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని జనగామ డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి తెలిపారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం చేర్యాల మండల కేంద్రంలోని కొమ్మూరి నివాసంలో జనగామ డిసిసి అధ్యక్షులు ప్రతాప్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్ మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంత బిడ్డగా ఈ ప్రాంత భౌగోళిక, రాజకీయ, సామాజిక ఆర్థిక పరిస్థితులపై తమరికి ఎంతో స్పష్టమైన అవగాహన కలిగి ఉన్నారని, 2009లో నియోజకవర్గాల పునర్విభజన మొదలుకొని 2016 లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నూతన జిల్లాల ఏర్పాటులో చేర్యాల ప్రాంతంలోని నాలుగు మండలాలను సిద్దిపేట జిల్లాలో కలిపి డివిజన్ పరంగా రెండు మండలాలను హుస్నాబాద్, రెండు మండలాలను సిద్దిపేట కు, అసెంబ్లీ నియోజకవర్గం జనగామ, ఎంపీ భువనగిరి, జిల్లా సిద్దిపేటకు ప్రాంతాలకు ఇష్ట రాజ్యాంగ వారి రాజకీయ స్వలాభం కోసం విడదీశారని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలకు కోసం పనులకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ప్రాంతం ఉనికి అస్తిత్వం, భౌగోళిక, స్థితి అత్యంత ప్రమాద స్థాయిలో పడిపోయిన విషయం తెలిసిందేనన్నారు. చేర్యాల ప్రాంతానికి రాజకీయ భౌగోళిక పరిస్థితులు, పూర్వం వైభవం తీసుకురావడం కోసం చేర్యాల ప్రాంతానికి చెందిన అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు విద్యార్థి, యువజన, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు ఏకమై సంఘటితమై ఐక్య కార్యాచరణ జేఏసీగా ఏర్పడి దాదాపు 8 సంవత్సరాల పాటు వినతులు, ధర్నాలు, రాస్తారోకోలు, బంద్ లు ఎన్నో ఉద్యమాలు చేపట్టినా గాని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేర్యాల ప్రాంత ప్రజల ఆకాంక్షలపై నీళ్లు చల్లడంతో పాటు అనేకమంది ఉద్యమకారులపై కేసులు పెట్టించడం జరిగిందని గుర్తు చేశారు. చేర్యాల ప్రాంత బిడ్డగా చేర్యాల ప్రజల చిరకాల కోరిక ఆకాంక్షను తమరు నెరవేర్చడంలో ప్రధాన పాత్ర పోషిస్తూ ప్రభుత్వాన్ని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ఒప్పించి చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా ప్రకటన చేయించాలని పేర్కొన్నారు. దీనిపై కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంతంలో పుట్టిన బిడ్డగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం నాడు ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ లో ఉండి నాటి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి రప్పించి చేర్యాలలో పెద్ద ఎత్తున ధర్నా చేశామన్నారు. చేర్యాల పూర్వం వైభవం కోసం జేఏసీ నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమాలకు ఊపిరి పోసిన గడ్డ చేర్యాల ఈ ప్రాంతానికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, హరీష్ రావు వారి స్వార్థం కోసం వాడుకొని మోసం చేశారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాలను సిద్దిపేట జిల్లాలో కలిపి ఆశాస్త్రీయంగా ఈ ప్రాంతాన్ని ముక్కలుగా విభజించి బీఆర్ఎస్ పార్టీ ఈ ప్రాంతానికి ద్రోహం చేసిందని మండిపడ్డారు. తాను పదవిలో ఉన్నా లేకున్నా చేర్యాల ప్రాంతానికి జరిగిన నష్టాన్ని పూడ్చడం కోసం రెవెన్యూ డివిజన్ గా, నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయడమే ఏకైక లక్ష్యంగా త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకులు పుర్మ ఆగంరెడ్డి, తోకల ఉమారాణి, అందె అశోక్, అందె బీరన్న, మల్లిగారి యాదగిరి, ఒగ్గు రాజు, చంద శ్రీకాంత్, కొమ్ము రవి, మహాదేవుని శ్రీనివాస్, మంచాల చిరంజీవులు, దాసరి శ్రీకాంత్, ఆడెపు నరేందర్, ఈరి భూమయ్య, అందె నాని బాబు, పుర్మ సంజీవరెడ్డి, మన్నె సత్య వర్ధన్, కాశెట్టి ఉపేందర్, ఎండి. జహురుద్దీన్, వంగపల్లి శ్రీనివాస్, ముత్యం అంజయ్య, పర్వతం చంద్రయ్య, బంగారు ప్రేమ్ కుమార్, బండి శ్రీనివాస్, నంగి కనకయ్య, బండారి సిద్ధులు, కే. రాజన్న, తిరుపతన్న, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశం

జెడ్పిసెంటర్ అక్టోబర్ 23 ప్రజా స్వేచ్ఛ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో బుధవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ గుంతెటి వీరభద్రయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కన్వీనర్ గుంతేటి వీరభద్రయ్య మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ను పునర్ పరిశీలించాలని కోరుతూ రాష్ట్ర స్థాయిలో జరుగుతున్నటువంటి పోరాటాలను జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ ఖమ్మం జిల్లాలో ఉండబడినటువంటి అన్ని మాల పల్లెలకు తెలియజేయాలని అన్నారు నవంబర్ నెలలో జరుగు మాలల సింహ గర్జన మీటింగ్ ను జయప్రదం చేయాలని ఆ మీటింగ్ కు రాష్ట్ర నాలుమూలల నుండి లక్షలాది మాల ప్రజలు కథలాలని పిలుపునిచ్చారు అనంతరం కార్యక్రమాలు చేయుటకు గాను ఈ క్రింద



పేర్కొబడిన వారిని కో కన్వీనర్స్ ని ఎన్నుకోవడం జరిగింది. మోటపోతుల బాబురావు, దామల సత్యనారాయణ గుమ్మడి కనకరాజు తొగరు భాస్కర్ కామా సంపత్ కుమార్ మేక తోటి కాంతయ్య కొర్లపాటి చిరంజీవి. చింతల రవి. లతోపాటు మాల మహానాడు నాయకులు లింగాల రవికుమార్ మూడుసు జాకోబ్ జిల్లా అధ్యక్షుడు కొట్టే సుధాకర్ కామా ప్రభాకర్ కొట్టే నాగేంద్రబాబు జెట్టి నవీన్ బాబు గొట్టె ముక్కల శ్రీను కట్టుకూరి నరసింహారావు నీరుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్న ఈటెల వ్యాఖ్యలకు ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి

**కూకట్ పల్లి 23, ప్రజా స్వేచ్ఛ**
రేవంత్ రెడ్డి, ఎంపీగా చేసిన అభివృద్ధిని చూసి సీఎంగా ఆయనకు తెలంగాణ ప్రజలు ప్రమోషన్ ఇచ్చారు. బండి రమేష్ కూకట్ పల్లి నియోజకవర్గం లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్న మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేంద్ర వ్యాఖ్యలకు ఎమ్మెల్యే కృష్ణారావు సమాధానం చెప్పాలని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. గత పది ఏళ్లలో కూకట్పల్లి నియోజకవర్గంలో రూ. పదివేల కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దానని, నియోజకవర్గాన్ని బంగారంగా తీర్చి దిద్యానని స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావు కథలు కథలుగా చెబుతాడని అయితే ఇలాంటి అభివృద్ధి ఈటెల రాజేందర్ కు కనిపించకపోవడం హాస్యాస్పదమన్నారు. మాట్లాడితే నియోజకవర్గం లో 90 శాతం పనులు పూర్తి చేసామని బ్రిడ్జిలు కట్టాం, నాళాల మీద కల్వర్టులు కట్టాం సిమెంట్ రోడ్లు వేసాం పార్కులు సుందరీకరణ చేసామంటూ కృష్ణారావు మహా గొప్పలు చెప్పుకుంటాడని బండి రమేష ని ఎద్దేవా చేశారు. అభివృద్ధి చేశాం అంటూ చెప్పిందే చెప్పి పదేళ్ల తర్వాత కూడా మళ్లీ పనులు తానే చేస్తున్నట్టు చెప్తూనే ఉన్నాడు. నియోజకవర్గంలో ఇంత గొప్పగా అభివృద్ధి జరిగితే ఎంపీ ఈటెల మాత్రం అభివృద్ధి ఏమాత్రం జరగలేదని అంటున్నాడు దీనికి కృష్ణారావు ఖచ్చితంగా సమాధానం చెప్పి తీరాలి తను తెచ్చిన పదివేల కోట్ల రూపాయలు ఎక్కడ ఏ పనులకు కేటాయించారో లెక్క చెప్పాల్సి ఉందని రమేష్ ప్రశ్నించారు. ప్రస్తుత ఎంపీ అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా ఉన్నారని మంత్రిగా ఆయన ఎంత అభివృద్ధి చేశారు ఆయన కూడా సమాధానం చెప్పాల్సి ఉందన్నారు మల్కాజ్గిరి నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి , చేసిన పనులతోనే ఆయనకు తెలంగాణ ప్రజలు ముఖ్యమంత్రిగా ప్రమోషన్ ఇచ్చారని రమేష్ పేర్కొన్నారు గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి ఇవ్వడం చేతగాక చేతులెత్తేసిన దళిత బంధు, డబల్ బెడ్ రూమ్ ఇళ్లు రేషన్ కార్డులు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలను లబ్ధిదారులకు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆయా పథకాల్లో లబ్ధిదారులు ఎంతమందో గత పాలకులు చెప్పాలన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఎంపీలు కూడా చాలా కాలంగా రాజకీయాల్లో ఉన్నారని వారి నియోజకవర్గాల్లో వారు చేసిన అభివృద్ధి ఏ పాటిదో వాళ్లే చెప్పాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కూకట్పల్లి నియోజకవర్గంలో పాలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని రమేష్ పేర్కొన్నారు నియోజకవర్గంలో వరద ముంపుకు గురవుతున్న అల్లాపూర్ ప్రాంతాన్ని రక్షించేందుకు రూ .27 కోట్లతో సున్నం చెరువు నుండి కాముని చెరువు వరకు నాలాను అభివృద్ధి చేస్తున్నామన్నారు కైతలాపూర్ నుండి రెయిన్బో విస్టా వరకు రోడ్డు అభివృద్ధి పనులు, పీజీ కాలేజీ ఏర్పాటు జేఎన్టీయూ నుండి హైటెక్ సిటీ వరకు స్కై బస్ వంటి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వలన కేవలం ఆరు నెలల వ్యవధిలో జరిగిన ఎంపి ఎలక్షన్లో సుమారు 22 వేల ఓట్లను కాంగ్రెస్ పార్టీ పెంచుకోగలిగిందన్నారు. అభివృద్ధి సంక్షేమం విషయంలో తమకు ఎవరు చెప్పాల్సిన అవసరం లేదని రమేష్ పేర్కొన్నారు అవి నిరంతరం కొనసాగుతాయి అన్నారు.



## కలేషా" మెడికల్ అండ్ జనరల్ స్టోర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ




**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 23 ప్రజా స్వేచ్ఛ**
కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పద్మా నగర్ ఫేస్ -1 లో నూతనంగా ఏర్పాటుచేసిన "కలేషా మెడికల్ అండ్ జనరల్ స్టోర్" ను ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, నాయకులు మక్సుద్ అలీ, జానయ్య, సంక్షేమ సంఘం సభ్యులు సత్తి రెడ్డి, సత్యం, దేవేందర్ రెడ్డి, ఖాసీం పీర, బొంబాయి శ్రీను, వేణు, సాంబశివ రావు, చంద్రమౌళి, నర్సింహా రెడ్డి, రమణ రెడ్డి, నజీర్, ఆంజనేయులు, అజయ్, వెంకటేష్, రాజు, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ సమావేశం.




**కూకట్ పల్లి అక్టోబర్ 23, ప్రజా స్వేచ్ఛ**
కెపి హెచ్ బి కాలనీలో కెపిహెచ్ బి నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ హాల్ లో మంగళవారం నాడు, సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరసింహనాయి, ప్రెసిడెంట్ పన్నాటి నాయి, సెక్రటరీ వెంకటేష్ నాయి, క్యాషియర్ జగన్ నాయి, ఉపాధ్యక్షులు భాస్కర్ నాయి, వార్డు మెంబర్లు, ఇతర నాయి బ్రాహ్మణులు సమావేశంలో పాల్గొని రేట్ల బోర్డులను అందరికీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా నవంబర్ నెల నుండి ప్రతినెల 200 రూపాయలు వసూలు చేయాలని నిర్ణయం తీసుకుని వార్డు మెంబర్లకి బాధ్యత అప్పగించడం జరిగింది. ప్రతి మంగళవారం కొంతమంది షాపులు తెరుస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, మంగళవారం నాడు, షాపులు తెలిస్తే 5000 రూపాయల జరిమానా విధించబడుతుందని తెలిపారు. అదేవిధంగా నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కరణల నిమిత్తం ప్రత్యేక జీవో తీసుకురావాలని కోరుతూ మన వృత్తి మన హక్కు అనే నినాదంతో ముందుకు సాగుతూ నవంబర్ నెల 5వ తారీకు, మంగళవారం నాడు డిజిపి అనుమతితో ఇంద్ర పార్క్ లో ధర్నా చేపడుతున్నామని, దీనికోసం తెలంగాణ నాయి బ్రాహ్మణ సోదరులందరూ తరలిరావాలని చెప్పడం జరిగింది. ఈ పోరాటం మన కోసమే కాదు మన పిల్లల భావితరాల కోసం అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి, అట్టడుగున పడకుండా మన వృత్తి ప్రత్యేక స్థానాన్ని పొందాలంటే మనమంతా కలిసికట్టుగా కృషి చేయాలని తప్పకుండా ఐదవ తారీఖున చలో ఇంద్ర పార్క్ రండి అందరూ కలిసి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 23 ప్రజా స్వేచ్ఛ :**
కొంపల్లి మున్సిపాలిటీ లోని దూలపల్లి సాయి నగర్ కాలనీ లో శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ప్రసన్న కుమార్ ఆహ్వాన మేరకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, శివ కుమార్ గౌడ్ , తులసి రెడ్డి, 126 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గణేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పాణ్యం డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసిన మల్లికార్జున రెడ్డి పై సిబిసిఐడి విచారణ జరిపించాలి.

**సిపిఐ.**




**నంద్యాల అక్టోబర్ 23, ప్రజా స్వేచ్ఛ**
రైతు పొలాలను తప్పుడు రికార్డులను సృష్టించి కోట్లు గడించిన డిప్యూటీ తాసిల్దార్ మల్లికార్జున రెడ్డి పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. సిపిఐ నంద్యాల జిల్లా పాణ్యం డిప్యూటీ తహసిల్దార్ గా పనిచేసిన మల్లికార్జున్ రెడ్డి పిన్నాపురం భూములలో వేల కోట్ల రూపాయలు మధ్యవర్తి గా వ్యవహరించి భూమి రికార్డు లేని వారికి భూమి రికార్డులు సృష్టించి బినామీ పేర్ల మీద అవినీతి సంపాదన పై సిబిసిఐడి విచారణ జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.నంద్యాల జిల్లాలో కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో. డక్కా. రవికుమార్ అవినీతిపై కోర్టు ఆదేశాల మేరకు సస్పెండ్ చేసి సిబిసిఐ డితో విచారణ జరిపించాలని వచ్చిన తీర్పును స్వాగతిస్తూ పాణ్యం మండలంలో పిన్నాపురం తదితర గ్రామాలలో గ్రీన్ కో సంస్థకు బ్రోకర్ల గా పనిచేసి మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తొత్తుగా వుంటూ భూమి రికార్డులు లేని వారికి భూమి రికార్డులు సృష్టించి బినామీ పేర్లతో అవినీతికి పాల్పడుతూ రైతు ల దగ్గర నుండి అతి తక్కువ రేటుకు భూములు కొనుగోలు చేయడంలో ప్రధాన పాత్ర వహించి వేల కోట్ల రూపాయలు సంపాదించిన అప్పటి పాణ్యం డిప్యూటీ ఎమ్మార్వో మల్లికార్జున్ రెడ్డి పై కూడా సిబి సిఐడి విచారణ జరిపించి కొల్లగొట్టిన ప్రజాధనాన్ని ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని తెలిపారు.జిల్లా లో ఇలాంటి ఆవినీతి అధికారులు పదుల సంఖ్యలో వున్నారని జిల్లా కలెక్టర్ అటువంటి వారిని గుర్తించి వారిపై శాఖపరమైన. చట్టపరమైన చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి అవినీతి తిమింగాలలను అదుపు పెట్టకపోతే ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని వారికి అండగా సిపిఐ పార్టీ ముందుండి అవినీతి అధికారులకు భరతం పడతామని పై నాయకులు హెచ్చరించారు.

## భద్రాచలం మొబైల్ కోర్టు కు రెగ్యులర్ మెజిస్ట్రేట్ ను నియమించాలి.....



**భద్రాచలం: అక్టోబర్ 23 ప్రజా స్వేచ్ఛ**
భద్రాచలం మొబైల్ కోర్టుకు రెగ్యులర్ మెజిస్ట్రేట్ నియమించాలి అని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు కి బుదవారం పలువురు న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు.అలాగే రెవెన్యూ మంత్రివర్యులు హైదరాబాద్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కు ఈ విషయం పై ఎమ్మెల్యే ద్వారా తెలియజేయాలి అని రెగ్యులర్ మెజిస్ట్రేట్ నియమించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది వినతిపత్రంలో కోర్టు ప్రస్తుతం ఉన్న %ాావఎబఅఖుతీఎ యబతీఅంఎఅష్ఱశీఅ% పరిధి ని ?5,000 నుండి ?20,00,000 వరకు పెంచడం, కోర్టు సిబ్బందిని నియమించడం, రెగ్యులర్ బడ్జెట్ కేటాయించడం వంటి పలు కీలక అంశాలు ప్రస్తావించబడ్డాయి.వినతి పత్రం ఇచ్చిన వారి లో భద్రాచలం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు కార్యని రా

## గజలక్ష్మి అమ్మవారి కటాక్షంతో అష్టైశ్వర్యాలు పొందాలి

**-ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 23, ప్రజా స్వేచ్ఛ**
సుభాష్ నగర్ 131డివిజన్ లిటిల్ స్టార్ స్కూల్స్ గ్రౌండ్ నందు ఒరిస్సా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గజలక్ష్మి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి. వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలె శ్రీకాంత్, రుద్రా అశోక్, నాయకులు సాంబయ్య, ఇస్మాయిల్, దుర్గారావు, మల్లేష్, రవికాంత్, కార్యక్రమ నిర్వాహక కమిటీ సభ్యులు పంచు, తపన్, గౌతమ్ రాయి, నీలు తదితరులు పాల్గొన్నారు.వ్రహక కమిటీ సభ్యులు కొడాలి శ్రీనివాసన్, చందా హనుమంతరావు, సున్నం రమేష్, జూనియర్ న్యాయవాది బూ రం రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## ఘనంగా "నల్ల పోచమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్టాపన" కార్యక్రమం...



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 23, ప్రజా స్వేచ్ఛ**
కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ నల్ల పోచమ్మ తల్లి దయతో ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్ దప్పు కిరణ్, నాయకులు బొమ్మ ప్రవీణ్, మహేష్, రాజు, రఘునాథ్, మధు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# హెరిటేజ్ ఫుడ్స్ ఆర్థిక ఫలితాలు అదుర్స్

## వినియోగదారులకు జొమాటో షాక్

### డెలివరీ ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు




ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో తన వినియోగదారులపై మరోమారు భారం పెంచాలని నిర్ణయించింది. బుధవారం నుంచి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ ఫీజును రూ.10కి పెంచింది. ఇంతక్రితం ప్రతి ఆర్డర్‌పై రూ.7 వసూలు చేస్తుంది. దీనికి అదనంగా మరో రూ.3 పెంచినట్టు వెల్లడించింది. దేశంలో కొనసాగుతున్న పండుగ సీజన్ సందర్భంగా వినియోగదారులకు తమ సర్వీసుల్ని విజయవంతంగా అందించేందుకు వీలుగా ఈ ఫీజును పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. తొలిసారి ప్లాట్‌ఫామ్ ఫీజును 2023లో ప్రవేశపెట్టింది. అప్పుడు రూ.2గా ఉండగా.. దీన్ని క్రమంగా పెంచుతూ వచ్చింది. ఈ సంస్థ రోజుకు సగటున 20-25 లక్షల ఫుడ్ ఆర్డర్లను డెలివరీ చేస్తోందని అంచనా.

## బీమా రంగంలోకి జియో ఫైనాన్షియల్..!

రిలయన్స్ ఇండిస్ట్రీస్‌కు చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసు బీమా రంగంలో జాయింట్ వెంచర్ (జేబీ) ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ఇప్పటికే ఈ అంశంపై అలియాంజ్ ఎస్ఈతో జట్టు కట్టేందుకు చర్చలు జరుపుతోందని సమాచారం. జర్మనీకి చెందిన అలియాంజ్ భారత్‌లో ఇప్పటికే ఉన్న రెండు సంయుక్త భాగస్వామ్య సంస్థలను రద్దు చేసుకోవాలని భావిస్తోంది. ఈక్రమంలో అలియాంజ్, జియో కలిసి జనరల్ ఇన్స్యూరెన్స్, లైఫ్ ఇన్స్యూరెన్స్ సేవల సంస్థను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నాయని రిపోర్టులు వస్తోన్నాయి.

### -క్యూ2లో రూ.48.6 కోట్ల నికర లాభం

హైదరాబాద్

హెరిటేజ్ ఫుడ్స్ సెప్టెంబరు త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.1,019.5 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.83.2 కోట్ల స్థూల లాభం, రూ.48.6 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 4.2 శాతం మాత్రమే పెరిగినా, స్థూల లాభం 76.8 శాతం, నికర లాభం 117 శాతం పెరిగాయి. ఒక త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.1,000 కోట్లు మించడం ఈ సంవత్సరం ఇది రెండోసారని హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది. ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో కంపెనీ రూ.2,052.2 కోట్ల ఆదాయంపై రూ.177 కోట్ల స్థూల లాభం, రూ.107.1 కోట్ల నికర లాభం ఆర్జించింది.గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 7.9 శాతం మాత్రమే పెరిగినా, స్థూల లాభం 102.7 శాతం, నికర లాభం 173 శాతం పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కంపెనీ రోజుకు సగటున 16.4 లక్షల లీటర్ల పాలు సేకరించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11.46 శాతం అధికం.

# మూడేండ్లలో డిజిటల్ చెల్లింపులు రెట్టింపు

### -60 శాతం నగదు లావాదేవీలే..
### -ఆర్‌బీఐ రిపోర్ట్




కరోనా తర్వాత భారత్‌లో డిజిటల్ చెల్లింపులు అత్యంత వేగంగా పెరిగిపోయాయి. గడిచిన మూడేండ్లలోనే రెట్టింపు అయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. అయినప్పటికీ.. ఇప్పటికీ నగదు చెల్లింపుల లావాదేవీలు 60 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఆర్‌బీఐ రిపోర్ట్ ప్రకారం..2021 మార్చి ముగింపు నాటికి డిజిటల్ చెల్లింపుల వాటా 14-19 శాతంగా ఉండగా.. 2024 మార్చి నాటికి 40-48 శాతానికి ఎగిశాయి. ఇదే సమయంలో నగదు వినియోగం భారీగానే నమోదయ్యిందని ఆర్‌బిఐ కరెన్సీ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన ప్రదీప్ భుయాన్ తెలిపారు. 2021 జనవరి-మార్చి కాలంలో ప్రయివేటు వినిమయంలో నగదు వాటా 81-86 శాతంగా ఉందన్నారు. 2024 జనవరి- మార్చి కాలంలో 52-60 శాతంగా నమోదయ్యిందన్నారు. మోడీ సర్కార్ 2016లో పెద్ద నోట్ల పేరుతో రూ.500, రూ. 1000 నోట్ల రద్దు చేసిన సమయంలో యునైటెడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపుల విధానం ప్రారంభమైంది. 2020 కరోనా సమయంలో ఈ చెల్లింపులు మరింత ఊపందుకున్నాయి. 2016-17లో రూ.3,872గా ఉన్న సగటు డిజిటల్ చెల్లింపులు.. 2023-24 నాటికి ఈ సగటు రూ.1,525కు తగ్గినప్పటికీ.. స్థూలంగా చెల్లింపులు అమాంతం పెరిగాయి. ఇది చిన్న విలువ కొనుగోళ్లకు పెరుగుతున్న వినియోగాన్ని సూచిస్తుంది. విలువ పరంగా 2021లో 33 శాతం వాటా కలిగిన డిజిటల్ చెల్లింపులు.. సంఖ్యా పరంగా యూపీఐ చెల్లింపులు 51 శాతం నుంచి 87 శాతానికి పెరిగాయి.

## ఎవర్రా మీరంతా.!

# 120 బంతుల్లో 344 పరుగులు..

### -33 బంతుల్లో ఊహకందని ఊచకోత..

ప్రస్తుతం టీ20 ప్రపంచకప్ రీజినల్ క్వాలిఫయర్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గాంబియా, జింబాబ్వే జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 344 పరుగులు చేసి టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా ప్రపంచ రికార్డును సాధించింది. అంతకుముందు మంగోలియాపై 314 పరుగులు చేసిన నేపాల్ పేరిట ఈ రికార్డు నమోదైన సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితం బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో టీమిండియా 297 పరుగులు చేసి ఈ జాబితాలో 2వ స్థానానికి చేరుకుంది.

**జింబాబ్వేకు పేలుడు ఆరంభం..**

తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వేకు శుభారంభం లభించింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ కేవలం 26 బంతుల్లో 50 పరుగులతో ఇన్నింగ్స్ ఆడగా,




తాడివానాషే మారుమణి కూడా కేవలం 19 బంతుల్లో 62 పరుగులు చేశాడు. దీంతో వీరిద్దరూ 5.4 ఓవర్లలో 98 పరుగులు సాధించారు. ఆపై నాలుగో నంబర్‌లో క్రీజులోకి వచ్చిన జింబాబ్వేకు అత్యంత అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ సికందర్ రజా బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ గాంబియా బౌలర్లకు చెమటలు పట్టించాడు.

**40 బంతుల్లో 141 పరుగుల భాగస్వామ్యం**

సికందర్ కేవలం 33 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ పేలుడు సెంచరీతో రోహిత్ శర్మ, దక్షిణాఫ్రికా ఆటగాడు డేవిడ్ మిల్లర్ రికార్డును సమం చేశాడు. వీరిద్దరూ గతంలో 35 బంతుల్లోనే సెంచరీలు చేసి ఈ రికార్డు సృష్టించారు. రజా చివరికి క్లైవ్ మదాండేతో కలిసి 40 బంతుల్లో 141 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో జట్టును 20 ఓవర్లలో 344 పరుగుల ప్రపంచ రికార్డు స్కోరుకు తీసుకెళ్లాడు.

**అత్యధిక సిక్సర్లు బాది సరికొత్త రికార్డు**

ఈ ఇన్నింగ్స్‌లో జింబాబ్వే బ్యాట్స్‌మెన్ సిక్సర్ల వర్షం కురిపించారు. కెప్టెన్ సికందర్ రజా తన బ్యాట్‌లో అత్యధికంగా 15 సిక్సర్లు, 7 ఫోర్లు బాదాడు. 17 బంతుల్లో 55 పరుగులు చేసిన మదండే 5 సిక్సర్లు బాదగా, మారుమణి 4 సిక్సర్లు బాదాడు. ఓవరాల్‌గా ఈ ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 27 సిక్సర్లు కొట్టి నేపాల్ (26) ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది.

## నేడు న్యూజిలాండ్‌తో రెండో టెస్టు..

# టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్లు గిల్, పంత్ ఫిట్

పూణె: స్వదేశంలో న్యూజిలాండ్‌తో గురువారం నుంచి పూణె వేదికగా జరగాల్సి ఉన్న రెండో టెస్టుకు భారత స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌తో పాటు వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఫిట్‌గా ఉన్నారని టీమ్‌ఇండియా అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్కటె అన్నాడు. తొలి టెస్టుకు ముందు గిల్ మెడ కండరాలు పట్టేయగా అదే మ్యాచ్‌లో కీపింగ్ చేస్తూ పంత్ మోకాలికి గాయమైంది. డస్కటె మాట్లాడుతూ.. 'జట్టులో అందరూ ఫిట్‌గా ఉన్నారు. గిల్ గత వారం బ్యాటింగ్ చేశాడు. కొంత అసౌకర్యంగా ఉన్నప్పటికీ రెండో టెస్టు నాటికి అతడు పూర్తిస్థాయిలో సిద్ధమవుతాడు. పంత్ ఫిట్‌గా ఉన్నాడు'



అని తెలిపాడు. గిల్ రాకతో మిడిలార్డర్‌లో సర్ఫరాజ్ ఖాన్, రాహుల్ మధ్య తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో పిచ్, పరిస్థితులకు అనుగుణంగా తుది జట్టును ఎంపికచేస్తామని డస్కటె తెలిపాడు.

# స్పోర్ట్స్

## తమిళ్ తలైవాస్‌కు రెండో విజయం..

### మోహిత్ పోరాడినా పుణెరి పల్టాన్‌కు తప్పని ఓటమి



ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో తమిళ్ తలైవాస్ వరుసగా రెండో విజయం సొంతం చేసుకుంది. రెండు విజయాలతో జోరు మీదున్న డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టాన్ కు చెక్ పెట్టింది. బుధవారం రాత్రి ఇక్కడి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 35-30 తేడాతో పుణెరి పల్టాన్‌ను ఓడించింది. తలైవాస్ తరఫున రైడర్లు నరేందర్ కండోలా 9, సచిన్ 8 పాయింట్లతో ఆకట్టుకున్నారు. డిఫెండర్ నితేశ్ కుమార్ (5) హైఫైవ్ సాధించాడు. పుణెరి జట్టులో రైడర్ మోహిత్ గోయత్ (13) ఒంటరి పోరాటం చేశాడు. ఈ మ్యాచ్‌లో పుణెరి పల్టాన్‌ను తలైవాస్ రెండుసార్లు ఆలౌట్ చేసింది. ఈ మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ ఆరంభం నుంచి జోరు చూపెట్టింది. నరేందర్ వరుసగా రెండు టచ్ పాయింట్లు రాబట్టగా, పంకజ్, అస్లాంను తలైవాస్ డిఫెండర్లు ట్యాకిల్ చేయడంతో ఆ జట్టు 4-0 ఆధిక్యంతో ఆటను ఆరంభించింది. అయితే, సచిన్‌ను సూపర్ ట్యాకిల్ చేసిన పుణెరి పల్టాన్ 5-%6తో ముందుకొచ్చింది. మోహిత్ వరుసగా రెండు డబుల్ పాయింట్ల రైడ్లతో ఆకట్టుకోగా.. అస్లాం కూడా డబుల్ పాయింట్ రైడ్ చేయడంతో పుణెరి 10-11తో నిలిచింది. కానీ, కోర్టులో మిగిలిన అస్లాంను ట్యాకిల్ చేసిన తలైవాస్ 8వ నిమిషంలో పుణెరి ఆలౌట్ చేసి 14-11తో ముందంజ వేసింది. ఇక్కడి నుంచి పుణెరి డిఫెన్స్‌లో మెరుగైనా తమిళ జట్టు తన ఆధిక్యాన్ని కాపాడుకుంది. డూ ఆర్ డై రైడ్ కి వచ్చిన మోహిత్‌ను ట్యాకిల్ చేసి 19-15తో తొలి అర్ధభాగాన్ని ముగించింది‌ద్వితీయార్థం మొదలైన వెంటనే సచిన్ ఓ టచ్ పాయింట్ తీసుకురాగా, ఆకాశ్‌ను నితేశ్ ట్యాకిల్ చేశాడు. డుబ్కితో ఎస్కేప్ అయ్యే ప్రయత్నం చేసిన అస్లాంను తలైవాస్ డిఫెండర్లంతా నిలువరించారు. దాంతో తలైవాస్ 22%-%15తో తన ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది.ఈ దశలో పుణెరి డిఫెండర్లు సత్తా చాటారు. నరేందర్‌ను సూపర్ ట్యాకిల్ చేసిన పుణెరి మరోసారి అతడిని నిలువరించింది. సాహిల్ ప్రత్యర్థికి దొరికిపోయినా సచిన్‌ను సూపర్ ట్యాకిల్ చేసిన పల్టాన్ డిఫెండర్లు 21-24తో అంతరాన్ని తగ్గించారు. కానీ, తలైవాస్ ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. నరేందర్ మళ్లీ రైడింగ్‌లో జోరు పెంచగా.. డిఫెండర్లు కూడా విజృంభించారు. ఈ క్రమంలో పుణెరిని రెండోసారి ఆలౌట్ చేసిన తలైవాస్ 30-22తో తన ఆధిక్యాన్ని భారీగా పెంచుకుంది. చివరి నిమిషాల్లో పుణెరి డిఫెండర్లు సూపర్ ట్యాకిల్స్ తో ఆకట్టుకోవడంతో ఓటమి అంతరం తగ్గింది.

# మౌలిక వసతులు కల్పన కు సహకరించాలి

**– జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ని ,డిప్యూటీ కమీషనర్ ముకుంద్ రెడ్డి ని కోరిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి అక్టోబర్ 23 ప్రజా స్వేచ్ఛ**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ని, డిప్యూటీ కమిషనర్ శ్రీ ముకుంద్ రెడ్డి ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం సమర్పించారు.అనంతరం జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి తో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్,రాయదుర్గం, మంజీర డైమండ్ హిట్స్,నల్లగండ్ల హుడా కాలనీ,నానక్ రామ్ గుడా లలో సీసీ రోడ్లు దెబ్బ తినడం వల్ల చిన్న పాటి వర్షానికి గుంతలలో నీరు నిలిచి స్థానిక ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తక్షణమే నూతన రోడ్లు వేయించాలని అలాగే గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని జనాభా దృశ్య రోడ్డు వెడల్పు కూడా చేయవలసిన అవసరం ఉందని కార్పొరేటర్ జోనల్ కమిషనర్ ని కోరడం జరిగింది.గచ్చిబౌలి డివిజన్ విస్తారమైన ప్రాంతం కాబట్టి, ఇక్కడ అన్ని రాష్ట్రాల ప్రజలు నివసిస్తారని, స్థానికుల మౌలిక వసతుల కోసం తగిన నిధులు మంజూరు చేయవలసిందిగా కార్పొరేటర్ జోనల్ కమిషనర్ కి కోరడం జరిగింది. దీనికి జోనల్ కమిషనర్ శ్రీ ఉపేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించడం జరిగింది.అనంతరం డిప్యూటీ కమీషనర్ ముకుంద్ రెడ్డి తో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై,చేపట్టవలసిన అభివృద్ధి పనులపై,కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించారు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పెండింగులో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి త్వరిత గతిన పూర్తయ్యేలా చూడాలని డిప్యూటీ కమీషనర్ శ్రీ ముకుంద్ రెడ్డి ని కార్పొరేటర్ కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అలోక్,అతుల్, మోహిత్,రాకేష్,రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ కు నేతల పరామర్శ

**-బహుజన నాయకుడు మాజీ సర్పంచ్ వద్దేపల్లి శ్రీనివాస్**



**హనుమకొండ అక్టోబర్ 23, ప్రజా స్వేచ్ఛ**

బుధవారం, ఐదవ రోజు మండలంలోని దేవన్నపేటకు చెందిన దళిత బహుజన ఫ్రంట్ (డిబీఎఫ్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ తండ్రి చుంచు వెంకటయ్య ఇటీవల మరణించగా బహుజన నాయకులు మాజీ సర్పంచ్ వద్దేపల్లి శ్రీనివాస్ , ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి (ఏబిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి మహేందర్,డిబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, బుధవారం ఐదవ రోజున పరామర్శించి చుంచు వెంకటయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుంచు వెంకటయ్య దేవన్నపేట గ్రామానికి వార్డు మెంబర్ గా ఎన్నికై గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో కుమారుడు చుంచు రాజేందర్ మహనీయుల బాటలో పయనిస్తూ సమసమాజ నిర్మాణం కోసమై పాటుపడుతూ పీడత,అణగారిన,బహుజన,మైనారిటీ ,మహిళ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అలుపెరుగకుండ పోరాడుతున్నాడని గుర్తు చేశారు. ఈ క్రమంలో ఆయన తండ్రి మరణించడం చాలా బాధాకరమని వ్యక్తిగతంగా ఆయన కుటుంబానికి సమాజానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్,బాగాది రాజేందర్, పెద్దన్న, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

# "బలగం" సినిమా లో "కాకి" అనే ఒక పక్షిని మన ఆచారంలో భాగంగా చూపించారు...

**ప్రజా స్వేచ్ఛ**

అయితే చాలా పక్షులు ఉన్నప్పటికీ కాకికి మాత్రం ఆ గౌరవం దక్కింది... ఎందుకంటే కాకి – "కాలజ్ఞాని" అంటారు"..!(

_వేకువ జామునే "(బ్రహ్మ ముహూర్తంలో)" మేల్కొని స్నానం ఆచరించే పక్షి కాకి_"కావు కావు" అంటూ ఈ బంధాలు, ఈ సిరి సంపదలు... ఏవీ నీవి కావు, ఏవీ శాశ్వతమూ "కావు కావు" అని అందరికీ గుర్తు చేస్తూ బోధిస్తూ అందరినీ తట్టి లేపేది కాకి. ఎక్కడయినా ఆహారం కనిపిస్తే అందుబాటులో ఉన్న "అన్ని కాకులకు" సందేశం పంపి గుమిగూడి అన్ని కాకులు కలసి ఆహారం ఆరగిస్తాయి అంత స్నేహపూర్వకంగా మసిలేది కాకి_శత్రువులను గుర్తించిన వెంటనే అన్ని కాకులకు సందేశం పంపి అన్ని సమీకరణలు చేసి "సంఘటితంగా పోరాటం" చేపట్టేవి కాకులు. ఆడ కాకి – మగ కాకి కలవడం కూడా 'పరుల కంట' పడకుండా ఎంతో గోప్యంగా కలుస్తాయి, అంత గుప్త జ్ఞానం కలిగి ఉండటం చెప్పదగ్గ విషయం. ఒక కాకి మరణిస్తే అన్ని కాకులు గుమిగూడి సంతాపం తెలియజేస్తూ కాసేపు అరుస్తూ రోధనలు చేసి స్నానమాచరించి గూటికి చేరే మంచి ఆచరణ కాకులదే.. _సూర్యాస్తమయం సమయానికి గూటికి చేరే సలక్షణమైన అలవాటు సమయపాలన కాకులదే... అంతేకాదు సూర్యాస్తమయం తరువాత ఆహారం ముట్టని సద్గుణం కూడా కాకులదే సుమా..

_కాకులు లేని ప్రదేశం లేదు ఈ భువిపై కాకి పళ్ళు తిని మరో చోట విసర్జన చేస్తే అక్కడ ఆ బీజం పడి మొలకెత్తి మొక్కలు పెరిగి వటవృక్షాలుగా పెరుగుతాయి... అలా పచ్చని ప్రకృతిని విస్తరించి పరిరక్షించుకోవడంలో కాకుల పాత్ర చాలా గణనీయమైనదే అందుకే "కాకులు దూరని కారడవి" అంటారు_కాకులు అరుస్తోంటే ఎవరో కావలసిన బంధువులు వస్తారు కాబోలు అందుకే కాకి అరుస్తోంది అనేవారు పెద్దలు _అంతేకాదు పకృతి వైపరీత్యాలు వచ్చే ముందు (భూమి కంపించే ముందు తుఫానులు వచ్చే ముందు) కాకులు సూచన చేస్తూ అరుస్తూ ఎగురుతూ లోకానికి సూచిస్తాయి.

సూర్య గ్రహణం ఏర్పడిన సమయంలో కాకులు గూటికి చేరి గ్రహణం విడిచాక స్నానమాచరించి బయట ఎగురుతాయి. అందుకే కాకిని కాలజ్ఞాని అంటారు. దానధర్మాలు ఆచరించని వారిని ఎంగిలి చేత్తో కాకిని తోలని వారిగా ఉదహరిస్తారు. _భోజనం చేసే ముందు మొదటి ముద్ద బయట గోడపై పెట్టి కాకుల్ని పిలిచేవారు పెద్దలు. మానవ జీవన పరిణామంలో కొన్ని తరాలను గుర్తు పెట్టుకునే సాక్షీభూతంగా ఉండే పక్షి కాకి. ఎక్కువ కాలం జీవిస్తుంది కనుక కాకి కలకాలం జీవించడం శాస్త్రంలో కూడా విశదీకరించారు.! _కూజాలో రాళ్ళు వేసి అట్టడుగున ఉన్న నీటిని పైకి తెచ్చి తరువాత దాహం తీర్చుకునే సాంకేతిక పరిజ్ఞానం కూడా సంతరించుకుంది కాకి...!! భారతీయుల సనాతన ధర్మం – విశిష్టత, ఆవశ్యకత నేటి జనం ఆచరించాల్సినవే. సంఘజీవనం.., సేవాతత్పరత.., మంచి స్నేహభావాలతో., ఈర్ష్యా ద్వేషాలు లేకుండా., కలసి మెలసి అన్యోన్యంగా., అసమానతలకు అతీతమైన ప్రేమానురాగాలతో., నైతిక విలువలు కలిగి కాకిలా కలకాలం జీవిద్దాము. ఇది చదివాక, కాకి జీవనంలో ఇంత తాత్వికత, ఇంత లోతైన అర్థం ఉందా!!!!! అనిపించింది. ఇది వీలైనంతమందికి పంచితే మంచిదేమో !... అనిపిస్తుంది పంపుతారు గదూ! సేకరణ:– ఒక మిత్రుడు ద్వారా వచ్చింది ,నాకు బాగా నచ్చింది, ఇందులో మంచి మేసేజ్ కూడిన నిజాలు ఉన్నాయి కనుక ఈ మెసేజ్ అందరి వద్దకు చేరేలా ప్రయత్నించండి. సత్యమేవ – జయతే ??



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# ప్రజాసమస్యల పరిష్కారంలో ఎల్లవేళ్లలా ముందుంటా

**– ఎమెల్సీ శంభీపూర్ రాజు**





**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 23, ప్రజా స్వేచ్ఛ**

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంఘ సభ్యులు శంభిపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

# కేంద్ర మాజీ మంత్రి 'సర్వే'ను సత్కరించిన శేరి సతీష్ రెడ్డి



**కూకట్ పల్లి అక్టోబర్ 23 ప్రజా స్వేచ్ఛ**

కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ను కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్వే సత్యనారాయణను శేరి సతీష్ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని వాటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో సైతం జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో... సీనియర్ నాయకులు బీఎస్పీ కూకట్ పల్లి కంటెస్టెడ్ అభ్యర్థి ప్రస్తుత కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి సంజీవరావు, చిటకోరు కృష్ణ, రాచమల్ల శేఖర్ గౌడ్, సోషల్ మీడియా ఇంచార్జ్ జి శేఖర్, రావుఫ్, తదితరులు పాల్గొన్నారు.

# విత్తన డీలర్లు విధిగా రికార్డులు నమోదు చేయాలి



**అక్టోబర్ 23, ప్రజా స్వేచ్ఛ , కేసముద్రం:**

బుధవారం రోజున మండల వ్యవసాధికారి బి.వెంకన్న పీఏసీఎస్ ధన్నసరి,కేసముద్రం పాయింట్,ఉప్పరపల్లి గోదాము మరియు మండలంలోని వివిధ ఎరువుల దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వెంకన్న మాట్లాడుతూ,ప్రతి డీలర్ ఎరువులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు,ఇన్వాయిసులు,ఈ పాస్ మిషన్ పరిశీలించాలని తెలిపారు.ప్రతి ఎరువుల డీలర్ విధిగా స్టాక్ రిజిస్టర్ మెయింటైన్ చేయాలని,స్టాక్ రిజిస్టర్ తో సమానంగా గోడౌన్ బ్యాలెన్స్,ఈపాస్ మిషన్ బ్యాలెన్స్ సమానంగా ఉండే విధంగా మెయింటైన్ చేయాలని అన్నారు.రైతులకు ఆధార్ కార్డు మీద మాత్రమే ఎరువులను సరఫరా చేయాలని,రైతులు తమకు కావలసిన ఎరువుల కోసం సొసైటీ సెంటర్లకు,ఎరువుల షాపులకు,ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు గాని వెళ్ళినప్పుడు తప్పనిసరిగా వారి యొక్క ఆధార్ కార్డు తీసుకువెళ్లి తమకు కావలసిన ఎరువులను తీసుకోవాలని సూచించారు.మండలంలోని ప్రతి ఎరువుల డీలర్ తమ షాపులో ఉన్నటువంటి అన్ని రకాల కంపెనీ ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్,ఓ ఫామ్స్,ఎరువులు,పురుగు మందుల లైసెన్సులో పొందుపరచాలని తెలిపారు.డీలర్లు ఎవరైనా కొత్తగా గోదాములు తీసుకుంటే అట్టి గోడౌన్,ఎరువులు,పురుగుమందుల,విత్తన లైసెన్సులు నమోదు చేసుకోవాలని సూచించారు.ప్రతి డీలరు తమ వద్ద ఉన్న ఎరువుల నిల్వలను ప్రతిరోజు మండల వ్యవసాయ అధికారికి తెలియజేయాలని,ఎవరైనా డీలరు నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది,ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.